

చెరువు మరువకు రాళ్లు తొలగించిన దృశ్యం(ఫైల్)

పరిహారం కోసం ప్రదక్షిణ



గండిచెరువు ముంపు భూములకు అందని పరిహారం

తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్న రైతులు

హామీ ఇచ్చి పట్టించుకోని కదిరి ఎమ్మెల్యే

గాండ్లపెంట

పరిహారం కోసం గండిచెరువు ముంపు భూముల రైతులు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. మండలంలోని వేపలకుంట గ్రామ సమీపంలో విజయనగర రాజుల కాలంలో గండిచెరువును నిర్మించారు. ఎన్నో ఏళ్ల కిందటే తెగిపోయిన ఈ చెరువుకు మరమ్మతులు చేయాలని సమీప రైతులు, రైతు సంఘాలు ప్రభుత్వాన్ని అభ్యర్థించాయి. ప్రభుత్వం 2009లో గండిచెరువు నిర్మాణ పనులను రూ.12 కోట్లతో ప్రారంభించింది. గండి చెరువు నిర్మాణం పూర్తయితే దాదాపు 54 ఎకరాల్లో భూమి ముంపునకు గురవుతుందని రెవెన్యూ అధికారులు గుర్తించారు. ఇందులో ప్రభుత్వ భూమి 10 ఎకరాలు కాగా మిగిలినది పట్టా భూమి. దీంతో గ్రామ సభలు నిర్వహించి, ముంపు భూములకు పరిహారం అందిస్తామని అధికారులు రైతులకు చెప్పారు.

43 మందికే పరిహారం

పట్టా భూమికి రూ.మూడు లక్షలు, డీపట్టా భూములకు రూ.1.8 లక్షలు పరిహారం చెల్లిస్తామని అధికారులు తెలిపారు. మొత్తం 65 మంది రైతులకు సంబంధించిన భూమి ముంపునకు గురవుతుండగా 43 మంది రైతులకు అప్పట్లోనే పరిహారం అందించారు. మిగిలిన వారికి నేటికీ ఒక్క పైసా ఇవ్వలేదు. దీంతో పరిహారం అందని రైతులు పలుమార్లు తహసీల్దార్లు, ఆర్డీవో, పెనుకొండ సబ్ డివిజన్‌లోని ఉన్నతాధికారులు, నాయకులకు వినతిపత్రాలు అందజేశారు. అయినా ఫలితం లేదు. దీంతో తామేం పాపం చేశామని ఇన్నేళ్లుగా పరిహారం ఇవ్వడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చెరువు నిండితే అంతే!

నాలుగేళ్ల కిందట తుఫాను ప్రభావంతో గండి చెరువు నిండి వేపలకుంట గ్రామంలోని ఇళ్లల్లోకి నీరు చేరాయి. అలాగే గండిచెరువు అటువైపు ఉన్న దాదాపు ఐదువందల ఎకరాల భూములకు దారిలేక, పండిన పంటలను కూడా వదిలేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలో భారీ వర్షాల కారణంగా వేపలకుంటలోకి నీరు రాగా వాటిని పరిశీలించడానికి ఎమ్మెల్యే సిద్ధారెడ్డి వచ్చారు. గ్రామానికి ప్రహరీ, రహదారి సౌకర్యం, గండిచెరువు ముంపు భూములకు పరిహారం అందిస్తామని అప్పుడు హామీ ఇచ్చారు. అయితే పదవీ కాలం ముగుస్తున్నా, ఇంతవరకు ఏ హామీ నేరవేర్చలేదు. దీనిపై గ్రామస్థులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. చెరువు అవతలి వైపు భూముల్లో పంటలు సాగుచేయాలంటే దారి లేకపోవడంతో రైతులు ఇరిగేషన్ జేఈని సంప్రదించారు. దీంతో చెరువు కట్ట మరువకు ఉన్న రెండు రాళ్లను తొలగించడంతో నీరు వృథాగా పోయిం ది. అందుకే రైతులకు రహదారి సౌకర్యం కల్పించి, గ్రామం చుట్టూ ప్రహరీ ఏర్పాటు చేయాలని గ్రామ రైతులు కోరుతున్నారు. ఇంక ఎన్నేళ్లకు తమకు పరిహారం అందిస్తారని ముంపు భూముల రైతులు ప్రశ్నిస్తున్నారు.

కాగా ఈ విషయమై ఇరిగేషన్ అధికారులను వివరణ కోరడానికి ప్రయత్నించగా ఎవరూ అందుబాటులోకి రాలేదు.

మా గోడు పట్టించుకునే వారే లేరు

నా ఎకరా పొలం కూడా గండిచెరువు ముంపు భూముల్లో ఉంది. గండిచెరువు పనులు చేసేటప్పుడు కొందరు రైతులకు పరిహారం అందజేశారు. నాకు మాత్రం రాలేదు. గత 15 సంవత్సరాలుగా రెవెన్యూ అధికారుల చుట్టు తిరుగుతున్నా. నాయకులు, రెవెన్యూ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా మా గోడు పట్టించుకోవడం లేదు. మాకు ఎప్పుడు పరిహారం ఇస్తారో తెలియదు. వెంటనే ముంపు రైతులకు పరిహారం అందించాలి.



- గంగిరెడ్డి, రైతు, వేపలకుంట

చెరువు అటువైపు భూములకు రహదారి కల్పించాలి



గండిచెరువుకు అటువైపు నాకు నాలుగు ఎకరాల పొలం ఉంది. వర్షాకాలం వస్తే చెరువు నిండిపోతుంది. సాగుచేసిన పంటలు ఇంటికి తేవడానికి వీలుకాదు. పలుమార్లు ఇరిగేషన్, వివిధ శాఖాధికారులకు రహదారి సౌకర్యం కల్పించాలని కోరాం. అయితే ఇంతవరకు ఎలాంటి స్పందన లేదు. ఎమ్మెల్యేకి విన్నవించినా పట్టించుకోవడం లేదు. ఈక్రమంలో చెరువుకు అటువైపు పంటలు వేయాలంటే ఇబ్బందిపడాల్సిన పరిస్థితి ఉంది.

- సుధాకర్‌రెడ్డి, రైతు, వేపలకుంట

అధికారపార్టీ వారికి డబుల్ ఓట్లు


40వ వార్డులో బయటపడుతున్న అక్రమాలు



మట్టెద్దుల ఆశకు డబుల్ ఓట్లు

ధర్మవరం రూరల్, ఫిబ్రవరి 27: ధర్మవరంలోని 40వ వార్డులో అధికార పార్టీకి చెందిన వారి డబుల్ ఓట్లు ఇబ్బడిముబ్బడిగా బయటపడుతున్నాయి. డబుల్ ఓట్లు, షిఫ్టింగ్ ఓట్లను తొలగించడం కోసం బీఎల్‌ఓలతో కలి సి పార్టీల ప్రతినిధులు ఇం టింటి సర్వే నిర్వహించారు. ఈ సమయంలో డబుల్ ఓట్లను గుర్తించారు. వీటిని తొలగించి తప్పులు లేని తుది ఓటరు జాబితాను విడుదల చేయాలన్న ఎన్నికల సంఘం ఆదేశాలను బీఎల్‌ఓలు తుంగలో తొక్కారు. వార్డులోని కౌన్సిలర్ బంధువైన మట్టెద్దుల ఆశకు సీరియల్ నెంబర్లు 1234, 708లో డబుల్ ఓ ట్లు వచ్చాయి. మట్టెద్దుల సుశీలమ్మకు 39వ వార్డు రామనగర్‌లో సీరియల్ 945లో ఓటు ఉంది. కానీ ఈమెకు 40వ వార్డులో శిథిలమైన ఇంటిని చూపు తూ ఎంట్రీకోసం ఫారం-8 దరఖాస్తు చేసుకున్నారు. మట్టెద్దుల శేషానందరెడ్డి 39వ వార్డులో సీరియల్ నెంబర్ 945లో ఓటు ఉంది. కానీ ఈయనకు 40వ వార్డులో నమోదు చేసుకున్నారు. మట్టెద్దుల శివారెడ్డి 257బూత్‌లో 39వవార్డులో సీరియల్ నెంబర్ 1251లో ఓటు ఉంది. ఈయన కూడా 40వవార్డులో ఓటు నమోదు చేసుకున్నారు. దీనిపై ప్రతిపక్ష నాయకులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. గతంలో కూడా ఇలానే డబుల్ ఓట్లు ఎంట్రీలు చేస్తున్నారని ఆధారాలతో అధికారులకు చూపించినా పరిగణలోకి తీసుకోలేదని వారు మండిపడుతు న్నారు. అందుకే ఈ సారి ఈ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని టీడీపీ నాయకులు పేర్కొన్నారు.

టోకెన్ ఉంటే రైట్... రైట్



వైసీపీ నాయకులు ఇస్తున్న నకిలీ బిల్లు

వైసీపీ నాయకుల నకిలీ దందా

టోకెన్ ఉంటే చాలు వాహనాన్ని ఆపరు

రాళ్లు, మట్టికి రాయల్టీ చెల్లించని వైనం

అధికారం అండతో చెలరేగుతున్న అక్రమార్కులు

ప్రభుత్వ ఆదాయానికి గండి

అటువైపు కన్నెత్తి చూడని అధికారులు

జేబులు నింపుకుంటున్న వైనం

హిందూపురం

ఇటీవల వచ్చిన ఓ సినిమాలో సరుకు రవాణా చేసే కంటైనర్‌ని ఆపడానికి అంతా భయపడిపోతుంటారు. దానిపై ఉన్న సీల్‌ని చూసి వణికిపోతారు. అదే తరహాలో జిల్లాలో నకిలీ దందా సాగుతోంది. అధికార పార్టీ నాయకులకు కప్పం కడితే చాలు రాళ్లు, మట్టి ఏదైనా రవాణా చేసుకోవచ్చు. ఆ సినిమాల్లో సీన్ మాదిరిగానే ఇక్కడ కూడా ఒక నకిలీ టోకెన్ సిస్టం నడుస్తోంది. ఆ టోకెన్ ఉన్న లారీని గానీ, ట్రాక్టర్‌ని గానీ ఎక్కడా ఎవరూ ఆపరు. ఎవరైనా ఆపితే తాము చూసుకుంటామని రవాణా చేసే యజమానులకు భరోసా ఇస్తారు. ఎక్కడైనా ఏ అధికారైనా టోకెన్ ఉన్న వాహనాలను ఆపితే ఆ అక్రమార్కులు రంగంలోకి దిగి సురక్షితంగా ఆ వాహనాన్ని అక్కడ నుంచి తప్పిస్తారు. ఇది కర్ణాటక సరిహద్దులో హిందూపురంతో పాటు పలు ప్రాంతాల్లో జరుగుతున్న నకిలీ దందా. ఇది మనం చెప్పడం కాదు.. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్సుమెంట్ అధికారుల దాడుల్లోనే వెలుగు చూసింది. ఆ నకిలీ బిల్లులు చూసి వారు నివ్వెరపోయారు. ఈ నకిలీ దందా ద్వారా అధికార పార్టీకి చెందిన కొందరు నాయకులు దర్జాగా లక్షలు పోగేసుకుంటున్నట్లు సమాచారం. ఈ అక్రమ రవాణాతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పన్నులు చెల్లించకుండా....

హిందూపురం ప్రాంతంలో పన్ను చెల్లించకుండానే పునాదికి వాడే రాళ్లు, మట్టి, గ్రానైట్ రవాణా చేసే వాహనాలను సరిహద్దులు దాటిస్తున్నారు. దీని వెనుక పెద్ద నెట్‌వర్క్ నడుస్తోంది. పన్నుల శాఖ అధికారులు ఇటీవల గ్రానైట్ అక్రమ రవాణా వైపు కన్నెత్తి చూసేందుకు కూడా సాహసం చేయడంలేదు. హిందూపురం, మడకశిర ప్రాంతాల్లో గ్రానైట్ క్వారీలు, పరిశ్రమలు ఉన్నాయి. ఆయా ప్రాంతాల నుంచి ప్రతి రోజు పెద్ద ఎత్తున మన రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాలకు గ్రానైట్‌ను ఎగుమతి చేస్తుంటారు. బయటరాష్ట్రాలకు వెళ్లే గ్రానైట్ ముడిసరుకుకు, పలకలకు వేబిల్లులు ఉండవు. రాత్రి వేళల్లో యథేచ్ఛగా ఈ అక్రమ రవాణా సాగుతున్నట్లు సమాచారం.

గోరంతకు దరఖాస్తు.. కొండంత తరలింపు

శ్రీసత్యసాయి జిల్లాలో భూగర్భగనుల శాఖ నుంచి ఓ వ్యక్తి టెండర్ దక్కించుకున్నాడు. మట్టికి, రాళ్లకు సంబంధించి మైన్స్ అండ్ జియాలజీ వారికి దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తులో పేర్కొన్నంతవరకు మాత్రమే రవాణా చేసుకోవాలి. కానీ ఇక్కడ దరఖాస్తు చేసుకునేది గోరంతైతే రవాణా మాత్రం కొండంత జరిగిపోతోంది. ఆఖరికి రైతులు తమ పొలాలకు మట్టిని తరలించుకున్నా రాయల్టీ చెల్లించాలి. అంతేకాకుండా ప్రభుత్వ నిబంధనల మేరకు ఉన్న వేబిల్లు ఇవ్వాలి. అయితే సోమవారం జరిగిన విజిలెన్స్ అధికారుల దాడులను బట్టి ప్రభుత్వం నుంచి టెండర్ పాడుకున్న అమిగోస్ మినరల్స్ కాంట్రాక్టర్ నుంచి చిలమత్తూరు మండలానికి చెందిన ఇద్దరు యువనాయకులు సబ్ కాంట్రాక్ట్ తీసుకున్నట్లు చెబుతున్నారు. దీంతో వారు ప్రైవేటు సైన్యాన్ని ఏర్పాటుచేసుకొని క్వారీల వద్ద, రోడ్ల పై కాపలా ఉంచి వాహనాల తనిఖీలు చేయిస్తున్నారు. క్వారీల నుంచి కంకరను తీసుకువచ్చే టిప్పర్లకు వే బిల్లు ఇస్తారు. కానీ 40కి పైగా లారీలు రాష్ట్ర సరిహద్దుగా ఉన్న కర్ణాటక ప్రాంతం నుంచి పునాది రాళ్లను హిందూపురం ప్రాం తానికి రోజు తరలిస్తుంటారు. వీటికి వేబిల్లు ఉండదు. ఎందుకంటే కొండల్లో రాళ్లను కొట్టేది చేతితో కాబట్టి వారికి బిల్లులు ఉండవు. దీని వలన ఆ వైసీపీ నాయకులు ఇచ్చిందే బిల్లు. ఇందులో కూడా ప్రభుత్వం, అసలైన కాంట్రాక్టర్ ఆదాయానికి గండి కొట్టే విధంగా నకిలీ బిల్లులు ఇస్తున్నారు. దీని వలన రాళ్ల లారీల నుంచే హిందూపురం ప్రాంతంలోనే నెలకు రూ.10 లక్షల వరకు ఆదాయం సమకూరుతున్నట్లు సమాచారం. ఈ వి షయం విజిలెన్స్ దాడుల్లో వెలుగుచూసింది. మట్టి తరలించుకోవాలం టే మైన్స్ అండ్ జియాలజీ అధికారుల నుంచి అనుమతి పొందాలి. కానీ ఇక్కడ సబ్‌కాంట్రాక్టర్‌గా ఉన్న వైసీపీ నాయకులు అనుమతి పొందకుండానే వారే నేరుగా నకిలీ బిల్లులు ఇస్తూ మట్టిని తరలిస్తున్నట్లు సమాచారం. దీనివల్ల ప్రభుత్వానికి వచ్చే ఆదాయానికి గండి పడుతోంది.



కంకర లారీకి ఇచ్చిన ఒరిజినల్ వే బిల్లు

చీకటి వ్యాపారం వైపు కన్నెత్తి చూడని అధికారులు

సరిహద్దులో పెద్ద ఎత్తున నకిలీ బిల్లుల వ్యవహారం సాగుతున్న సంబంధిత అధికారులు కన్నెత్తి చూడకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. అయితే అధికార పార్టీ నాయకులు చేస్తున్న దందా తెలిసే జరుగుతోందా? లేక తెలియక జరుగుతోందా? లేక మంత్రి అండతో చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారా? అనేది తెలియాల్సి ఉంది.

రూ. లక్షలు వెనుకేసుకుంటున్న వైనం

అక్రమార్కులు నకిలీ బిల్లులు ఇచ్చి లక్షలు వెనకేసుకుంటున్నట్లు సమాచారం. ప్రైవేటు సైనాన్ని అడ్డం పెట్టుకొని నకిలీ బిల్లుల ద్వారా అడ్డంగా దోపిడీకి పాల్పడుతున్నట్లు సమాచారం. హిందూపురం ప్రాంతంలో మట్టికి గిరాకీ ఎక్కువ, దీనిని ఆసరాగా చేసుకొని మట్టిని రాత్రిపూట ఈ నకిలీ బిల్లులతో యథేచ్ఛగా తరలించేస్తున్నట్లు సమాచారం. ఈ ప్రాంతానికి చెందిన వైసీపీ నాయకులకు మంత్రి పెద్దిరెడ్డి అండదండలు పుష్కలంగా ఉన్నాయని చెప్పుకుంటుంటారు. ఇందుకు బలం చేకూర్చేవిధంగా నకిలీ బిల్లులు ఇవ్వడంతో పాటు విజిలెన్స్ అధికారులు దాడులు చేసినా మంత్రి నుంచి ఫోన్ రావడంతో అధికారులు వెనక్కి వెళ్లిపోయినట్లు సమాచారం.

పల్లె ఆధ్వర్యంలో

విద్యుత్ సబ్ స్టేషన్ ముట్టడి

రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్



విద్యుత్ ఏఈకి వినతిపత్రం ఇస్తున్న పల్లె రఘునాథరెడ్డి తదితరులు

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 27: రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలంటూ మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ముట్టడించారు. రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను 9 గంటలు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పల్లె మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్ నిర్లక్ష్యంతోనే విద్యుత్ కోతలు అధికమయ్యాయన్నారు. పగటిపూట రైతులకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలన్నారు. టీడీపీ పాలనలో ఎక్కడ విద్యుత్ కోతలు ఉండేవి కావని గుర్తుచేశారు. అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ముందు జాగ్రత్తతోనే విద్యుత్ మిగులు ఏర్పడిందన్నారు. దీంతో రైతులకు, కొత్త పరిశ్రమలకు నాణ్యమైన విద్యుత్ అందించినట్లు వివరించారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక లోవోల్టేజీలు, కోతలు అధికమయ్యాయన్నారు. వ్యవసాయ కనెక్షన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు రైతులకు మంజూరుచేయాలని కోరుతూ వినతిపత్రాన్ని ఏడీఈ ఓబులేసు, ఈఈ రామసూరారెడ్డికి అందించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, నియోజకవర్గ పరిశీలకులు పార్థసారథి, మండల కన్వీనర్ జయచంద్ర, పిట్టా ఓబులరెడ్డి, రామానాయుడు, రాజారెడ్డి, నాయకులు సుధాకర్, ఆంజనప్ప, నిజాం, బూదిలి ఓబులరెడ్డి, శంకర్‌రెడ్డి, శ్రీనివాసులు, తుమ్మల మహబూబ్‌బాషా, కొండే ఈశ్వరయ్య, కంచిసురేష్, మండోజీ ఆర్ఫీఖాన్, రమణరెడ్డి, బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విధులను నిర్వర్తించండి

హోంగార్డు కమాండెంట్ మహేష్‌కుమార్

పుట్టపర్తి రూరల్, ఫిబ్రవరి 27: క్రమశిక్షణతో విధులు నిర్వర్తించి పోలీసు శాఖకు మంచిపేరు తీసుకురావాలని కమాండెంట్ మహేష్‌కుమార్ హోంగార్డులకు పిలుపునిచ్చారు. జిల్లాకేంద్రంలోని శిరసాని పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో మంగళవారం ఆయన హోంగార్డుల నుంచి గౌరవవందనాన్ని స్వీకరించారు. అనంతరం ఏర్పాటు చేసిన హోంగార్డుల దర్బార్‌లో ఆయన మాట్లాడుతూ ఉద్యోగంలో చేరిన మొదటి రోజుల్లో శిక్షణలో నేర్చుకున్న అంశాలను ఎప్పుడూ గుర్తుంచుకోవాలన్నారు. హోంగార్డుల దైనందిన విధులు సవాళ్లతో కూడుకున్నవన్నారు. విధుల్లో నైపుణ్యాన్ని పెంచుకోవాలని సూచించారు. అనంతరం విధుల్లో ప్రతిభ కనబరిచిన వారికి ప్రశంసా పత్రాలను అందచేశారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ విజయ్‌కుమార్, ఏఆర్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, ఏఆర్ ఎస్సై శ్రీరాములు, సబ్‌డివిజన్ హోంగార్డు ఇన్‌చార్జి, హోంగార్డు సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల విధులను నిష్పక్షపాతంగా నిర్వహించాలి

కలెక్టర్ అరుణ్‌బాబు



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ

పుట్టపర్తి, ఫిబ్రవరి 27: సార్వత్రిక ఎన్నికల విధులను నిష్పక్షపాతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మంగళవారం కలెక్టరేట్‌లో ఎస్పీ మాధవరెడ్డితో కలిసి ఆయన ఎన్నికల నిర్వహణపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలను ఏమాత్రం ఉల్లంఘించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కోడ్ అమలులోకి వచ్చిననాటి నుంచి సిబ్బంది అంతా భారత ఎన్నికల సంఘం ఆధీనంలో పని చేయాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల కమిషన్ విడుదల చేసిన హ్యాండ్‌బుక్‌లో ఉన్న అంశాలను సిబ్బంది పూర్తి అవగాహన చేసుకోవాల న్నారు. జిల్లాలో 1561 పోలింగ్ కేంద్రాలున్నాయని ఆయా పోలింగ్ కేంద్రాలలో మౌలిక వసతులన్నింటిని ముందస్తుగా పూర్తి చేయాలన్నారు. ఒక పోలింగ్ స్టేషన్ పరిధిలో 1500ఓట్లకు మించి ఉంటే మరో కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఓటరు సవరణకు సంబంధించి వచ్చిన ఫారం-6, 7, 8 క్లైంలను 29లోగా పరిష్కరించాలని ఆదేశించారు. రాష్ట్ర సరిహద్దుల్లో గట్టి నిఘా ఉంచాలంటూ ఎస్పీ మాధవరెడ్డి ఆదేశించారు. సమస్యాత్మక గ్రామాలు, పోలింగ్ కేంద్రాలపై గట్టి నిఘా ఉంచడంతోపాటు తాజా పరిస్థితులను పరిశీలనలోకి తీసుకోవా లన్నారు. జిల్లాలో 390 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలున్నాయని వీటిపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. కార్యక్రమంలో జేసీ అభిషేక్ కుమార్, పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, డీఆర్‌ఓ కొండయ్య, ఆర్డీఓలు భాగ్యరేఖ, వంశీకృష్ణ, వెంకటశివరాంరెడ్డి, నియోజకవర్గ ఎన్నికల అధికారులు, డీఎస్పీలు వాసుదేవన్, శ్రీనివాసులు, శ్రీలత, కంజక్షన్ పాల్గొన్నారు.

మార్చిలో రాగిపిండి పంపిణీ

పుట్టపర్తి, ఫిబ్రవరి 27 : రేషన్ కార్డుదారులకు మార్చి నెలలో కిలో రాగిపిండిని రూ.11 చొప్పున పంపిణీ చేయనున్నట్లు జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక్కో కార్డుదారుడికి ఉచిత బియ్యంతో పాటు కిలో రాగులను ఉచితంగా పంపిణీ చేయాలని, వీటితో పాటు కిలో రాగిపిండిని రూ.11కు పంపిణీ చేయాలని ఆదేశాలు వచ్చాయని, కార్డుదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు పీఎం కిసాన్, సున్నా వడ్డీ సొమ్ము విడుదల

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 27: పీఎం కిసాన్, సున్నా వడ్డీ సొమ్మును బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి సీఎం జగన్ మోహన్‌రెడ్డి విడుదల చేస్తున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2023-24 సంవత్సరం మూడో విడతలో 2.94 లక్షల మంది రైతులకు రూ.59.01 కోట్ల పీఎం కిసాన్ సొమ్ము, 2021-22 రబీ, 2022-23 ఖరీఫ్ సీజన్లకు సంబంధించి 83,534 మంది రైతులకు రూ.17.25 కోట్ల సున్నా వడ్డీ సొమ్ము నేరుగా జమ చేస్తారన్నారు.

రేపు ఏపీటీఎఫ్ నిరసనలు



పోస్టర్ విడుదల చేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

అనంతపురం విద్య, ఫిబ్రవరి 27 : ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలన్న డిమాండ్‌తో ఈనెల 29న అన్ని నియోజవకర్గ కేంద్రాల్లో నిరసన చేపట్టనున్నట్లు ఏపీటీఎఫ్ నాయకులు పేర్కొన్నారు. మంగళవారం ఉపాధ్యాయభవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి నరసింహులు మాట్లాడుతూ... ఈనెల 27న జరగాల్సిన చలో విజయవాడను ఏపీ జేఏసీ అర్ధంతరంగా వాయిదా వేసిందన్నారు. దీన్ని ఏపీటీఎఫ్ తీవ్రంగా వ్యతిరేకించిందన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని వ్యతిరేకిస్తూ ధర్నా చేయనున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్లతో కలిసి నిరసన చేపడ్తామన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సిరాజుద్దీన్, ఉపాధ్యక్షులు సతీష్, ఓబులేసు, రాష్ట్ర కౌన్సిలర్లు సర్దార్ వలి, వెంకటరమణ, ఇతర నాయకులు వన్నప్ప, శ్రీనివాసులు, మహేష్, రామూర్తి, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

లోకల్ ఆఫీసర్లకే పట్టం!

- ఎన్నికల వేళ ఫెవికాల్ వీరులకు అగ్రస్థానం
- మూడేళ్ల నిబంధనలు మూలకు..
- ఇటీవల 8 మండలాల్లో ఇన్‌చార్జ్‌లకు అవకాశం
- మూడు, నాలుగేళ్లున్న వాళ్లకే ఇన్‌చార్జ్ ఎంపీడీఓ బాధ్యతలు
- ఎమ్మెల్యేల 'అధికార' ముద్రకు ఆమోదమా..?





జడ్పీ కార్యాలయం

అనంతపురం విద్య, ఫిబ్రవరి 27: ఎన్నికలు పారదర్శకంగా జరగాలంటే పాత అధికారులు పోవాలి. కొత్త అధికారుల రావాలి. అప్పుడే పక్షపాతం లేకుండా, అధికార పక్షానికి అంటకాగకుండా ఎన్నికలు సాగుతున్నాయన్న నమ్మకం ఉంటుంది. అందుకే ఎన్నికల సంఘం కూడా ఎన్నికల వేళ పాత వారికి బై..బై చెప్పి కొత్త అధికారులను దించుతుంది. ముఖ్యంగా ఎన్నికల విధుల్లో ఉండే అధికారులు ఒకే చోట మూడేళ్ల పని చేసి ఉంటే వారందరనీ బదిలీ చేయమని ఆదేశాలిస్తుంది. అయితే మన జిల్లా అధికారులు మాత్రం ఇటీవల ఎఫ్ఏసీ బాధ్యతలంటూ...స్థానికంగా మూడేళ్ల, నాలుగేళ్ల ఉన్న వారికీ పట్టం కట్టడంపై విమర్శలు వస్తున్నాయి. నాలుగైదేళ్ల స్థానికంగా మండలాల్లో ఉన్న ఈఓఆర్డీలకు ఎంపీడీఓలుగా ఎఫ్ఏసీ బాధ్యతలు ఇవ్వడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. స్థానిక ఎమ్మెల్యేల ఆమోదంతోనే జిల్లా అధికారులు వారికి ఎంపీడీఓలుగా ముద్ర వేసి నియమించారన్న ఆరోపణలు వస్తున్నాయి.

ఎనిమిది మండలాలకు ఎఫ్ఏసీలే దిక్కు

లోక్‌సభ, ఏపీ అసెంబ్లీ ఎన్నికలు నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో మూడేళ్ల ఒకేచోట పని చేసిన ఎంపీడీఓలను కర్నూలు, కడప జిల్లాలకు బదిలీ చేశారు. జిల్లా నుంచి సుమారు 38 మందిని ఇతర ప్రాంతాలకు బదిలీ చేశారు. ఇతర జిల్లాల నుంచి ఉమ్మడి జిల్లాకు 36 మంది ఎంపీడీఓలను నియమించారు. ఈ మేరకు గత నెలలో పీఆర్ కమిషనర్ ఉత్తర్వులు జారీచేశారు. అయితే ఇతర జిల్లాల నుంచి అనేక కారణాల వల్ల కొందరు ఎంపీడీఓలు ఈ జిల్లాకు రాకపోవడంతోపాటు, ఇతర కారణాలతో జిల్లా వ్యాప్తంగా 8 మండలాల్లో ఎంపీడీఓ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో ఆయా మండలాల్లో పని చే



గార్లదిన్నె ఎంపీడీఓ కార్యాలయం

స్తున్న ఈఓఆర్డీలు, ఏఓలకు జిల్లా అధికారులు ఎంపీడీఓగా పూర్తి స్థాయి అదనపు బాధ్యతలు అప్పగించారు. అయితే దీని వెనుక అధికార పార్టీ ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధుల ప్రమేయం ఉందన్న విమర్శలు వస్తున్నాయి.

ఏళ్ల తరబడి తిష్టవేసినోళ్లకే...

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 8 మండలాల్లో ఎంపీడీఓ పోస్టులు ఖాళీగా ఉండటంతో... అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు, ఈఓఆర్డీలతో ప్రత్యామ్నాయ ఏర్పాటు చేశారు. బొమ్మనహాళ్, కణేకల్లు, గార్లదిన్నె, అమడగూరు, కొత్తచెరువు, చిలమత్తూరు, రొద్దం, రొళ్ల మండలాలకు స్థానికంగా, పక్కనున్న మండలాల్లో ఉన్న ఏఓలు, ఈఓఆర్డీలనే ఎంపీడీఓ(ఎఫ్ఏసీ)లుగా నియమిస్తూ ఈ నెల 8న జడ్పీ అధికారులు ఉత్తర్వులు ఇచ్చారు. రాయదుర్గం నియోజకవర్గంలోని ఓ మండలానికి చెందిన ఓ ఈఓఆర్డీ సుమారు నాలుగేళ్లుగా పనిచేస్తున్నా ఎంపీడీఓగా నియమించారు. శింగనమల నియోజవకర్గంలోని ఓ మండలానికి చెందిన ఈఓఆర్డీ సైతం ఐదేళ్లుగా అదే మండలంలో విధులు నిర్వర్తిస్తున్నట్టు తెలుస్తోంది. ఆ ఈఓఆర్డీని ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా నియమించారు. పుట్టపర్తి నియోజవకర్గంలోని ఓ మండలానికి పక్క మండలంలో సుమారు ఐదేళ్లుగా పనిచేస్తున్న ఓ ఈఓఆర్డీని నియమించడంపై విమర్శలు వస్తున్నాయి. ధర్మవరం నియోకవర్గంలోని ఓ మండలానికి మూడేళ్లకు పైగా పనిచేసిన అనుభవం ఉన్న ఈవోఆర్డీని, పెనుకొండ నియోజకవర్గంలోని ఓ మండలానికి సైతం 4 ఏళ్లుగా పనిచేస్తున్న ఈఓఆర్డీని ఎంపీడీఓగా వేయడంపై ఆరోపణలు వినిపిస్తున్నాయి. నాలుగైదేళ్ల నుంచి పనిచేస్తున్న ఈఓఆర్డీలు స్థానిక అధికార పార్టీ ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధుల కనుసన్నల్లోనే పనిచేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఎన్నికల వేళ వారినే ఎంపీడీఓలుగా నియమిస్తూ...జడ్పీ అధికారులు ఉత్తర్వులు ఇవ్వడం, వాటి ఆధారంగా వారినే ఎన్నికల ప్రవర్తనా నియామావళి (ఎంసీసీ) అమలు చేసే అధికారులుగా నియమిస్తూ ఈ నెల 15న జిల్లా ఉన్నతాధికారులు ఉత్తర్వులు ఇవ్వడంపై అనేక ఆరోపణలు వినిపిస్తున్నాయి. మూడేళ్ల నిబంధనలను తుంగలో తొక్కడంపై విమర్శలు వస్తున్నాయి.

ఉల్లి రైతు కంట కన్నీరు



- నాలుగు నెలల క్రితం ప్యాకెట్ ధర రూ.2,200
- ప్రస్తుతం రూ.500కు పడిపోయిన వైనం
- అప్పులపాలవుతామంటున్న రైతులు



ఉల్లి గడ్డలను గ్రేడింగ్ చేస్తున్న కూలీలు

అనంతపురం అర్బన్/యాడికి , ఫిబ్రవరి 27 : ఉల్లి రైతు కంట కన్నీరు కారుతోంది. ధర అమాంతం పడిపోవడంతో అన్నదాతలు భారీగా నష్టపోతున్నారు. పెట్టుబడి ఖర్చులు కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 600 ఎకరాల్లో ఉల్లి పంట సాగు చేశారు. యాడికి, రాయదుర్గం, గుంతకల్లు తదితర ప్రాంతాల్లో బోరుబావుల కింద ఉల్లి పంట అధికంగా సాగు చేశారు. పంట సాగుకు ఎకరాకు రూ.50వేల నుంచి రూ.80వేల దాకా పెట్టుబడి ఖర్చు అవుతుంది. పంట బాగా పండితే ఎకరాకు 200 నుంచి 400 ప్యాకెట్ల వరకు దిగుబడి వస్తుంది. ఈ సారి జిల్లాలోని కొందరు రైతులకు ఎకరాకు 150 నుంచి 180 ప్యాకెట్ల దాకా దిగుబడి వచ్చింది. మరి కొందరికి 190 నుంచి 200 ప్యాకెట్ల వరకు దిగుబడి వచ్చింది. దిగుబడి ఉన్నా ధర లేక అన్నదాతకు ఆవేదన తప్పడం లేదు.

నాలుగు నెలల్లో పడిపోయిన ధరలు

నాలుగు నెలల క్రితం ఉల్లి ప్యాకెట్ (50కేజీలు) రూ.2,200 పలికింది. ఆ తర్వాత రూ.1600 నుంచి రూ.1800 వరకు ఉండేది. ప్రస్తుతం ప్యాకెట్ ఉల్లి ధర రూ.500కు పడి పో యింది. స్థానికంగా గిట్టుబాటు కాకపోవడంతో కొందరు రైతులు చెన్నైమార్కెట్‌కు తరలిస్తున్నారు. మరికొందరు పొలాల వద్దనే దళారులకు అమ్మేస్తున్నారు. మరోవైపు ధర పెరగకపోతుందా అనే ఆశతో కొందరు నిల్వ చేసుకుంటున్నారు.



ధర పతనంతో నష్టాలు

: రైతు ప్రభాకర్‌రెడ్డి, కోనుప్పలపాడు, యాడికి మండలం

రెండెకరాల్లో ఉల్లి పంట సాగు చేశా. 400 ప్యాకెట్ల దిగుబడి వచ్చింది. ప్రస్తుతం చెన్నైమార్కెట్‌లో ఉల్లి ప్యాకెట్ ధర రూ.500 పలుకుతోంది. నాలుగు నెలల క్రితం ప్యాకెట్ ధర రూ.2,200 ఉండేది. ధర పూర్తిగా తగ్గిపోవడంతో నష్టపోతున్నాం. ప్రభుత్వమే ఆదుకోవాలి.



పెట్టుబడి ఖర్చులు కూడా కష్టమే

: రైతు రామకృష్ణ, కోనుప్పలపాడు

ఒకటిన్నర ఎకరాలో ఉల్లి పంట వేశా. ధరలు పూర్తిగా తగ్గిపోయాయి. ఈ ధరలు ఏ మాత్రం గిట్టుబాటు కావు. పండించిన పంటను నిల్వచేసుకోలేక తప్పని పరిస్థితుల్లో అమ్ముకోవాల్సి వస్తుంది. ఈ సారి పెట్టుబడి ఖర్చులు కూడా రాలేదు. ధరలు పెరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. అప్పుడే రైతులకు న్యాయం జరుగుతుంది. లేదంటే ఈ సారి ఉల్లి రైతులంతా నష్టాలతో అప్పులపాలు కావల్సిందే.



పథకం ప్రకారమే శ్రీకృష్ణపై దాడి

- ఎమ్మార్పీఎస్ రాయలసీమ జిల్లాల ప్రతినిధి అక్కులప్ప

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 27: ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై ముందస్తు పథకం ప్రకారమే వైసీపీ దాడిచేసిందని ఎమ్మార్పీఎస్ రాయలసీమ జిల్లాల అధికార ప్రతినిధి అక్కులప్ప మండిపడ్డారు. మంగళవారం ఆ సంఘం కార్యాలయంలో అక్కులప్ప మాట్లాడుతూ బహిరంగ సభ నిర్వహించాలంటే ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటారన్నారు. సీఎం దృష్టికి ప్రజా సమస్యలు తీసుకెళ్లాలన్న ప్రతిపక్షాలు, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాల నాయకులకు నోటీసులిస్తారు. అయితే భౌతిక దాడులకు పాల్పడే వారిని ఎందుకు నిలువరించలేకపోయారని ప్రశ్నించారు. రాప్తాడులో నిర్వహించిన 'సిద్ధం' బహిరంగ సభకు ఎనిమిది జిల్లాల నుంచి ప్రజలను తరలించినప్పుడు మరింత జాగ్రత్త చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై లేదా అని నిలదీశారు. బహిరంగ సభలను నిర్వహించినప్పుడు వార్తలద్వారా ప్రజలకు చేరవేయాల్సిన బాధ్యత మీడియాపై ఉంటుందని, రాజ్యాంగం కల్పించిన మీడియా హక్కులను హరిస్తూ దాడులు చేయడం ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలోకి నెట్టడమేనన్నారు. శ్రీకృష్ణపై దాడిచేసిన వారందరినీ అరెస్ట్‌చేసి జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అక్కులప్ప

ఎంటెక్, ఎంసీఏ పరీక్షా ఫలితాలు విడుదల

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 27: ఎంటెక్, ఎంసీఏ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ తెలిపారు. మంగళవారం కళాశాల కాన్ఫరెన్స్‌హాల్లో ఫలితాలను విడుదలచేసిన ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఎంటెక్ ప్రథమ సెమిస్టర్(ఆర్21), ఎంసీఏ ప్రథమ సెమిస్టర్(ఆర్21) రెగ్యులర్ పరీక్షలను ఫిబ్రవరిలో నిర్వహించడం జరిగిందన్నారు. విద్యార్థులు వారి ఫలితాలకోసం అకడమిక్ సెక్షన్ అధికారులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ అరుణకాంతి, డీసీలు విష్ణువర్ధన్, లలిత, విభాగాధిపతులు భారతి, మమత, అజిత, భువనవిజయ, దిలీప్‌కుమార్, రామశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

అధైర్యం వద్దు..అండగా ఉంటాం..

- కార్యకర్తల కుటుంబాలకు టీడీపీ నాయకుల భరోసా
- చంద్రబాబు అరెస్టను తట్టుకోలేక మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేత



చెక్కు అందజేస్తున్న మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు

రాయదుర్గం, ఫిబ్రవరి 27 : టీడీపీ అధినేత చంద్రబాబునాయుడి అరెస్టును తట్టుకోలేక మరణించిన కార్యకర్తల కుటుంబాలకు పార్టీ అండగా నిలుస్తోందని రాయదుర్గం నియోజకవర్గ అభ్యర్థి కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. కణేకల్లు మండలం గోపులాపురం గ్రామంలో చంద్రబాబు అక్రమ అరెస్టు వార్తతో మరణించిన తలారి వన్నూరప్ప కుటుంబాన్ని ఆ పార్టీ నాయకులతో కలిసి పరామర్శించారు. కుటుంబ సభ్యులకు రూ.3లక్షల చెక్కు అందజేశారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. మండల కన్వీనర్ లాలెప్ప, బసవరాజు, బాయినేని నవీన్ పాల్గొన్నారు.

అనంతపురం అర్బన్ : చంద్రబాబు అరెస్టును తట్టుకోలేక గుండెపోటుతో మృతి చెందిన డేరంగుల వెంకటమ్మ కుటుంబ సభ్యులకు టీడీపీ తరఫున రూ.3 లక్షలు ఆర్థిక సాయం చేశారు. మంగళవారం స్థానిక అశోక్‌నగర్‌లోని వెంకటమ్మ నివాసానికి మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి కుమారుడు వైకుంఠం మధుకర్ చౌదరి వెళ్లి కుటుంబ సభ్యులకు పార్టీ అందించిన రూ.3 లక్షల ఆర్థిక సాయం అందజేశారు. నాయకులు మారుతీకుమార్ గౌడ్, రామాంజనేయులు, నారాయణస్వామి యాదవ్, పరమేష్, మనోహర్, రంగా, గుండప్ప, వెంకటేశులు, సాయి కృష్ణ, మల్లికార్జున, సాయి, శంభోకర్ పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న మధుకర్ చౌదరి



నగదు అందజేస్తున్న టీడీపీ నాయకుడు హరినాథ్

గుత్తిరూరల్ : మండలంలోని బేతాపల్లి గ్రామంలో 'నిజం గెలవాలి' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. సెప్టెంబరులో చంద్రబాబు అరెస్టును జీర్ణించుకోలేక గ్రామానికి చెందిన జయమ్మ (55) మృతి చెందింది. పార్టీ ఆదేశాల మేరకు మృతురాలి కుటుంబానికి రూ.3 లక్షల చెక్కు అందజేశారు. నాయకులు దిల్కా శీనా, నాగరాజు సాంబశివ, నాగేంద్ర, గోవర్ధన్, రంగారెడ్డి యాదవ్, లాలు, గోవిందు, నారాయణ స్వామి, అగ్గిరాముడు, సూరి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

కళ్యాణదుర్గం : టీడీపీ నేత ఉమామహేశ్వరనాయుడు ఆదేశాల మేరకు ముద్దినాయనపల్లి గ్రామంలో నాయకులు ఆర్థికసాయం అందజేశారు. నారా చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టును తట్టుకోలేక గుండెపోటుతో మరణించిన తలారి శ్రీరాములు భార్య సాకమ్మకు రూ.3 లక్షల చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కన్వీనర్ గోవిందు, నాయకులు, కార్యకర్తలకు టీడీపీ పార్టీ ఎల్లప్పుడూ అండగా వుంటుందని తెలిపారు.



ఆర్థికసాయం అందజేస్తున్న టీడీపీ నాయకులు

టెన్షన్ టెట్...!

- తొలిరోజు సాంకేతిక సమస్యలు
- అభ్యర్థులకు తప్పని ఇబ్బందులు
- 322 మంది గైర్హాజరు

అనంతపురం విద్య, ఫిబ్రవరి 27 : ఏపీ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ తొలిరోజు కొన్ని చోట్ల అభ్యర్థులకు టెన్షన్ తప్పలేదు. మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా టెట్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. అనంతపురం జిల్లా వ్యాప్తంగా అనంతపురం నగరం, నగర శివార్లలో 6 కేంద్రాలు, తాడిపత్రిలో 2 కేంద్రాలు, గుత్తిలో ఒక సెంటర్‌లో ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహించారు. అయితే తొలి రోజు కావడంతో అభ్యర్థుల్లో హడావుడి, టెన్షన్ నెలకొంది. ఉదయం, మధ్యాహ్నం రెండు విడతల్లో పరీక్షలు నిర్వహించారు. తొలి రోజు కొన్ని పరీక్షా కేంద్రాల్లో సర్వర్ సమస్య, సాంకేతిక సమస్యల కారణంగా మధ్యాహ్నం పరీక్షల్లో నిర్ణీత సమ యం కంటే...20 నిమిషాలు ఆలస్యంగా పరీక్షలు ప్రారంభమైనట్లు సమాచారం. సాంకేతిక కారణాల వల్ల అభ్యర్థుల ఫేస్ రికగ్నేషన్, ఇతర వివరాలు డౌన్‌లోడ్ ఆలస్యంగా కావడంతో...పరీక్షల ప్రారంభం ఆలస్యమైంది. అయితే నిర్ణీత స మయం వరకూ పరీక్షలు నిర్వహించడంతో అభ్యర్థులు ఊపిరి పీల్చుకున్నారు. పాఠశాల విద్య కడప ఆర్జేడీ రాఘవరెడ్డి జిల్లాలోని పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. జిల్లా వ్యాప్తంగా 322 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. ఉదయం 1359 మందిని పరీక్షా కేంద్రాలకు కేటాయించగా 1191 మంది హాజరు కాగా 168 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 1211 మందిని కేటాయించగా.... 154 మంది అభ్యర్థులు గైర్హాజరైనట్లు విద్యాశాఖ అధికారులు పేర్కొన్నారు. అయితే తొలి రోజు గందరగోళం నెలకొంది. పరీక్షాకేంద్రాలను, అబ్జర్వర్లను, ఇతర సిబ్బందిని జిల్లా విద్యాశాఖాధికారులు కేటాయించారు. అయితే చాలా మంది ఉద్యోగులు తమకు టెట్ డ్యూటీ వేసినట్లు కూడా తెలియదని వాపోతున్నారు. కొన్ని సెంటర్లలో అనుభవం లేని సిబ్బందికి డ్యూటీలు వేయడంతో వారు....అవస్థలు పడ్డారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఎస్సీ సెక్షన్ నిర్లక్ష్యం వల్ల అభ్యర్థులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారుల నుంచి స్పందన లోపించడంతో...అభ్యర్థులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.



పరీక్షా కేంద్రం వద్ద వేచి ఉన్న అభ్యర్థులు



పరీక్ష హాల్‌లోకి వెళ్లేందుకు క్యూలో నిల్చున్న అభ్యర్థులు

అవినీతి పాలన త్వరలోనే అంతం

- మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి
- ఆయన సమక్షంలో 50 కుటుంబాలు టీడీపీలోకి చేరిక



టీడీపీలో చేరినవారితో పల్లె, నిమ్మల తదితరులు

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 27: రాష్ట్రంలో అవినీతి పాలనతో ప్రజలు విసిగెత్తిపోయారని, త్వరలోనే ఆ పాలన అంతం కానుందని మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఇనగలూరు గ్రామంలో మంగళవారం ఆయన పర్యటించారు. ఇనగలూరుతో పాటు గొల్లపల్లినుంచి దాదాపు 50కుటుంబాల వారు వైసీపీని వీడి ఆయన సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి పల్లెతో పాటు మాజీ ఎంపీ నిమ్మలకిష్టప్ప, మాజీ ఎమ్మెల్సీ బచ్చలపుల్లయ్య కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో పల్లె మాట్లాడుతూ.. రాష్ట్రంలో గత నాలుగున్నరేళ్లకు పైగా అరాచక పాలన సాగుతోందన్నారు. ఈ పాలనతో ప్రజలు విసిగిపోయారన్నారు. సీఎం జగన్ విద్యుత్, బస్సు ఛార్జీలు, నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెంచి ప్రజల నడ్డి విరిచారన్నారు. ఎక్కడా కూడా ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేదన్నారు. అన్నీ అరాచకాలు, దౌర్జనాలతో వైసీపీ పాలన సాగిందన్నారు. ఈ పాలనను అంతం చేయడానికి ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు. నిమ్మల కిష్టప్ప మాట్లాడుతూ రాష్ట్రం మళ్లీ గాడిన పడాలంటే చంద్రబాబు సీఎం కావాలని చెప్పారు. సమావేశంలో పార్టీ మండల కన్వీనర్ శెట్టివారి జయచంద్ర, జడ్పీటీసీ మాజీ సభ్యుడు పిట్టా ఓబుల రెడ్డి, సర్పంచ్ శంకర్‌రెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాసులు, మాజీ కన్వీనర్ రామానాయుడు, నాయకులు షబరీష్‌నాయుడు, సూర్యనారాయణ నాయుడు, రాజారెడ్డి, పీట్ల సుధాకర్, నిజాం, మండోజీ ఆర్ఫీఖాన్, తుమ్మల మహబూబ్ బాషా, రాయల్‌కుమార్, భాస్కర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, చంద్రారెడ్డి, గంగిరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, బోయపల్లి శివారెడ్డి, మస్తానమ్మ, అఖిల, భాగ్యమ్మ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



గొల్లపల్లిలో ప్రచారం చేస్తున్న పల్లె రఘునాథ రెడ్డి

గొల్లపల్లిలో రా.. కదలిరా

ఓబుళదేవరచెరువు: మండలంలోని ఇనగలూరు పంచాయతీ గొల్లపల్లిలో మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. రా.. కదలిరా... కార్యక్రమంలో భాగంగా ఆయన పర్యటించి ప్రజలకు మినీ మేనిఫెస్టో పథకాలను వివరించారు. రానున్న ఎన్నికల్లో వైసీపీకి గుణపాఠం చెప్పాలని కోరారు. మహిళలు, వృద్ధుల నుంచి విశేష స్పందన లభించింది. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే ప్రజా సంక్షేమం



ఒకటో వార్డులో భవిష్యత్తుకు గ్యారెంటీలో పాల్గొన్న టీడీపీనాయకులు



18వ వార్డులో ..

- భవిష్యత్తుకు గ్యారెంటీలో టీడీపీ నాయకులు

ధర్మవరం, ఫిబ్రవరి 27: చంద్రబాబుతోనే ప్రజా సంక్షేమం సాధ్యమని టీడీపీ రాష్ట్రకార్యదర్శి కమతం కాటమయ్య, పట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్ పేర్కొన్నారు. పట్టణంలోని 1వ వార్డు గూడ్‌షెడ్‌కొట్టాలలో మంగళవారం వారు పట్టణ ప్రచార కమిటీ ఆధ్వర్యంలో బాబుష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలకు మినీమేనిఫెస్టో కరపత్రాలు పంచుతూ పథకాల గురించి వివరించారు. చంద్రబాబు సీఎం అయితేనే అన్నివర్గాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. ప్రజాసంక్షేమాన్ని కాంక్షించేది చంద్రబాబేనన్నారు. కనుక వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని వారు ప్రజల్ని కోరారు. కార్యక్రమంలో నాయకులు భీమనేని ప్రసాద్‌నాయుడు, రాళ్లపల్లిషరీఫ్, శీలామూర్తి, జిలకరశీన, గోసలశ్రీరాములు, అత్తార్‌రహీంబాషా, బత్తల గంగాధర్, కరెంటు ఆది, మాదవరెడ్డి, మారుతీస్వామి, నాగేంద్ర, చెలిమిశివరాం,తొగట అనిల్, వాసుదేవ, బాబావలి,లోకేశ్, ఆనందరెడ్డి,వీర, తెలుగుమహిళలు ముతకూరు బీబీ, స్వర్ణకుమారి, శారద, చౌడమ్మ, మున్నీ, నాగరత్న, ప్యారీమా, ఇందిరా, రామకృష్ణమ్మ తదితరులు పాల్గొన్నారు. అలాగే 18వ వార్డులోనూ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని ఆ వార్డు టీడీపీ ఇన్‌చార్జి కత్తుల బాబ్జీ, హిందూపురం పార్లమెంట్ తెలుగు మహిళా కార్యదర్శి కత్తులసునీత, మైనార్టీనాయకుడు షేక్ హుస్సేన్, బూత్ కన్వీనర్లు సూర్యనారాయణ, పూజారి నిర్మల, షేకరేష్మ, పూజారి నాగరాజు, జయకృష్ణ తదితరులు నిర్వహించారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ



ధర్మవరంలోని శాంతినగర్ పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్

ధర్మవరం, ఫిబ్రవరి 27: పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ అరుణ్‌బాబు మంగళవారం తనిఖీ చేశారు. స్థానిక శాంతినగర్, గూడ్‌షెడ్‌కొట్టాల, సంజయ్‌నగర్‌లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి అక్కడి వసతులను పరిశీలించారు. కేంద్రాల్లో మౌళిక వసతుల కల్పనలో ఎలాంటి పొరపాట్లు జరగకూడదని అధికారులను ఆదేశించారు. ప్రతి ఓటరు ఓటు హక్కు వినియోగించుకునేలా ముందస్తుచర్యలు తీసుకోవాలన్నారు. డబుల్ ఓట్లు, మృతిచెందిన ఓట్లు, బోగస్ ఓట్లను ఎప్పటికప్పుడు సూపర్‌వైజర్ల ద్వారా విచారణ చేయించి వాటిని తొలగించి పారదర్శకతతో కూడిన ఓటరు జాబితాను తయారు చేసేలా చూడాలన్నారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ వెంకటశివారెడ్డి, కమిషనర్ రాంకుమార్, ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఈశ్వరయ్య, డీ ఎస్పీ శ్రీనివాసులు, వన్‌టౌన్ సీఐ సుబ్రమణ్యం, వీఆర్వో యోగేశ్వరరెడ్డి ఉన్నారు.

తాడిమర్రి/ బత్తపల్లి: తాడిమర్రిలోని ఉన్నతపాఠశాలలో గల మూడు పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ అరుణ్‌బాబు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడి మౌలిక వసతుల గురించి స్థానిక అధికారులతో ఆరా తీశారు. పూర్తిస్థాయిలో ఏర్పాట్లు ఉండాలని తహసీల్దార్ నజ్మాబానును ఆదేశించారు. ఎస్‌ఐ నాగాస్వామి, ఎంఈఓ కృష్ణమోహన్ తదితరులు ఉన్నారు. అలాగే బత్తలపల్లి మండలం మాల్యవంతం పోలింగ్ కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. అక్కడ విద్యుత్ సౌకర్యం, మరుగుదొడ్లు సరిగా ఉన్నాయా అని తహసీల్దార్ శివశంకర్‌నాయక్‌ను ఆరా తీశారు.

బీజేవైఎం కమిటీ ఎంపిక



గోనుగుంట్ల సూర్యనారాయణను సన్మానిస్తున్న బీజేవైఎం మండల కమిటీ సభ్యులు

ధర్మవరం, ఫిబ్రవరి 27: బీజేవైఎం ధర్మవరం మండల నూతన కమిటీని ఆ శాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణస్వామియాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం ఎంపిక చేశారు. మండల అధ్యక్షుడిగా నీరుగంటి పోతలయ్య, ప్రధానకార్యదర్శిగా ప్రదీప్, ఉపాధ్యక్షుడిగా మాబుతో పాటు మరికొందరిని కమిటీసభ్యులుగా ఎంపిక చేశారు. దీంతో నారాయణస్వామి యాదవ్ ఆధ్వర్యంలో నూతన సభ్యులు అనంతపురం వెళ్లి మాజీ ఎమ్మెల్యేగోనుగుంట్ల సూర్యనారాయణను పూలమాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా బీజేపీ ధర్మవరం రూరల్‌అధ్యక్షుడు పెద్దిరెడ్డిగారి అరవిందరెడ్డి, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రమేశ్‌రెడ్డి, జిల్లాఅధ్యక్షుడు జీఎంశేఖర్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రవితేజరెడ్డికి వారు కృతజ్ఞతలు తెలియజేశారు.

హోంగార్డు కుటుంబానికి ఆర్థికసాయం

పుట్టపర్తిరూరల్, ఫిబ్రవరి 27: ఈనెల 6వ తేదీన మేడాపురం వద్ద జరిగిన రోడ్డుప్రమాదంలో మృతిచెందిన హోంగార్డు నాగప్ప కుటుంబానికి ఎస్పీ మాధవరెడ్డి ఆర్థిక సాయం అందచేశారు. పట్టణంలోని తన కార్యాలయంలో మంగళవారం ఆయన హోంగార్డు నాగప్ప భార్య ఉదయకు వెల్ఫేర్‌ఫండ్ కింద 20 వేల రూపాయల చెక్‌ను అందజేశారు. మృతుడి కుటుంబానికి పోలీసు శాఖనుంచి రావలసిన ఇతర ఆర్థిక సహాయాలను కూడా త్వరలోనే అందేవిదంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్‌ఐ చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

అధ్వానంగా గ్రామీణ రహదారులు

- కంకర తేలి, గుంతలు పడిన వైనం
- ప్రయాణం నరకప్రాయమంటున్న ప్రజలు
- పట్టించుకోని సంబంధిత అధికారులు

ధర్మవరం రూరల్, ఫిబ్రవరి 27: మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. గుంతలు పడి, కంకర తేలి ఉండడంతో వాటిపై ప్రయాణం చేయాలంటే నరకంగా ఉందని ఆయా గ్రామాలప్రజలు వాపోతున్నారు. ముఖ్యంగా వసంతపురం గ్రామానికి వెళ్లే రోడ్డు పూర్తిగా కంకర తేలి ఉంది. ధర్మవరానికి వెళ్లే ప్రధాన రహదారి నుంచి ఆ గ్రామానికి వెళ్లే 2కిలోమీటర్ల మేర ఉన్న రోడ్డు అధ్వానంగా ఉందని, ఆటోలు, ద్విచక్రవాహనాల్లో వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తేలిన కంకర వల్ల బైక్‌లు అదుపుతప్పి కింద పడుతున్నాయని అంటున్నారు. అదేవిధంగా తుమ్మల నుంచి తిప్పేపల్లి, సుబ్బరావుపేట గ్రామాలకు వెళ్లే రోడ్డు పూర్తిగా ధ్వంసమై గుంతలు ఏర్పడ్డాయి. మోకాటి లోతు గుంతలు పడడంతో ప్రయాణానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆయా గ్రామస్థులు వాపోతున్నారు. గుంతల్లో వాహనాలు సరిగా ముందుకెళ్లలేని దుస్థితి నెలకొంటోందని అంటున్నారు. వర్షం కాలంలో అయితే పరిస్థితి మరింత దారుణంగా ఉంటోందని చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధితాధికారుల ను స్పందించి రోడ్లను బాగుచేయాలని వారు కోరుతున్నారు.



కంకరతేలి అధ్వానంగా ఉన్న వసంతపురానికి వెళ్లే రోడ్డు



గుంతలమయమైన మల్లేనిపల్లి, తుమ్మలకు వెళ్లే రోడ్డు

ప్రశాంతంగా టెట్

కొత్తచెరువు, ఫిబ్రవరి 27: జిల్లా కేంద్రంలోని సంస్కృతి ఇంజనీరింగ్ కళాశాలలో టెట్ పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా జరిగాయి. ఈ పరీక్ష కేంద్రాలను జిల్లా విద్యాశాఖ అధికారి మీనాక్షి పరిశీలించారు. టెట్ పరీక్షకు వందమంది హాజరు కావాల్సి ఉండగా.. 82 మంది అభ్యర్థులు హాజరయ్యారని డీఈఓ తెలిపారు. 18మంది గైర్హాజరయ్యారన్నారు. మధ్యాహ్నం జరిగిన టెట్‌పరీక్షకు వంద మంది హాజరు కావాల్సి ఉండగా 88 మంది హాజరయ్యారని, 12 మంది గైర్హాజరయ్యారని చెప్పారు. ఆమె వెంట విద్యాశాఖ అధికారులు, సంస్కృతి కళాశాల సిబ్బంది ఉన్నారు.

ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు

కదిరిఅర్బన్, ఫిబ్రవరి 27: పట్టణంలోని వీవర్సుకాలనీమున్సిపల్ హైస్కూల్‌లో మంగళవారం ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా లీడ్ బ్యాంక్ మేనేజర్ మధుసూదన్ మాట్లాడుతూ.. ఈనెల 26న ప్రారంభమైన ఆర్థిక అక్షరాస్యతా వారోత్సవాలను మార్చి 1వరకు నిర్వహిస్తామన్నారు. భారతీయ రిజర్వ్‌బ్యాంకు 2016నుంచి ప్రతి సంవత్సరం ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు నిర్వహిస్తోందన్నారు. ఆర్థిక అక్షరాస్యతపై విద్యార్థులను చైతన్యపరచడమే వారోత్సవాల ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలోని 8,9,10 తరగతుల విద్యార్థులకు పొదుపు, బ్యాంకింగ్ అవసరాలు, డిజిటల్ , సైబర్ నేరాలపై వక్తృత్వ పోటీలను నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనబరచిన వారికి బహుమతులు అందజేశారు. ఎంఈఓ చెన్నక్రిష్ణ, ప్రధానోపాధ్యాయుడు నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ ధర్నాకు తరలిరండి

ధర్మవరం, ఫిబ్రవరి 27: తమ డిమాండ్ల సాధన కోసం గురువారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ టీకే ముత్యాలప్ప, జిల్లా ఉపాధ్యక్షులు బలరాముడు, మండల,పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఈశ్వరయ్య, శివానంద, జగదీశ్, శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లకు 12వ పీఆర్సీ జూలై 2023 నుంచి అమలు పరచాలని, 30శాతం మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలని, సీపీఎస్‌ను రద్దుచేయాలని, 11వ పీఆర్‌సీ బకాయిలతో పాటు పీఎఫ్, ఏపీజీఎల్‌ఐ రుణాలు ఇతర బకాయిలను విడుదలచేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న రెండు డీఏలను మంజూరుచేయాలని కోరారు. ఈ డిమాండ్ల సాధనకు చేపట్టే ధర్నాకు ఉపాధ్యాయులు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ముదిగుబ్బ, ఫిబ్రవరి27: ఈనెల 25వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మండలంలోని నాగులగుబ్బలకు చెందిన నరసింహుడు (21) తన తండ్రితో కలిసి బైక్‌పై వెళుతుండగా.. మండల కేంద్రంలోని దొరిగల్లు రోడ్డు సమీపంలో లారీ ఢీకొట్టింది. ప్రమాదంలో తండ్రీకొడుకులు తీవ్ర గాయాలై చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. కాగా అనంతపురం ఆస్పత్రిలో కొడుకు నరసింహుడు(21) చికిత్స పొందుతూ మరణించాడని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ముదిగుబ్బ పోలీసులు పేర్కొన్నారు. మృతుడికి వివాహం కాలేదన్నారు.

రేపు కౌన్సిల్ సమావేశం

ధర్మవరం, ఫిబ్రవరి 27: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో గురువారం కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించనున్నట్టు మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మీ, కమిషనర్ రాంకుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశం ఉదయం 11గంటలకు ప్రారంభమవుతుందని చెప్పారు. అధికారులు, కౌన్సిలర్‌లు, కోఆప్షన్‌మెంబర్లు తప్పక హాజరుకావాలని కోరారు.

యువతను ఆదుకోవడంలో ప్రభుత్వాలు విఫలం: ఏఐవైఎఫ్

ముదిగుబ్బ, ఫిబ్రవరి27: యువతను ఆదుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఏఐవైఎఫ్ నాయకులు విమర్శించారు. మండలకేంద్రంలో మంగళవారం ఏఐవైఎఫ్ జిల్లా సదస్సు జిల్లా కార్యదర్శి బిల్లు కుళ్లాయప్ప అధ్యక్షతన జరిగింది. ఇందులో పలువురు నాయకులు మాట్లాడుతూ.. రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని ప్రధాని నరేంద్రమోదీ, ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని సీఎం జగన్ ఇద్దరూ నిరుద్యోగులను మోసం చేశారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతను మభ్యపెట్టి పాలన సాగిస్తున్నాయని విమర్శించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులతో పాటు ఏఐఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఉరుసు ఉత్సవాలు

కొత్తచెరువు, ఫిబ్రవరి 27: మండల కేంద్రంలోని హజరత్ సయ్యద్‌షా మస్తాన్ వలి 121వ ఉరుసు మహోత్సవాలు ఈ నెల 29వతేదీ నుంచి మూడు రోజులు పాటు నిర్వహించనున్నట్టు దర్గాకమిటీ చైర్మన్ అతావూర్ రహిమాన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 29న గంధం పూజతో ఈ మహోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. మార్చి1న దీపారాధన, ఖవ్వాలి ఉంటాయన్నారు. 2వ తేదీన జియారత్‌తో ఉరుసు మహోత్సవాలు ముగుస్తాయని చెప్పారు. హిందూముస్లింలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

వైద్యశాఖ గ్రీవెన్స్‌కు రెండు ఫిర్యాదులు

పుట్టపర్తిరూరల్, ఫిబ్రవరి 27: జిల్లాకేంద్రంలోని వైద్యఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక గ్రీవెన్స్‌లో రెండు ఫిర్యాదులు అందాయి. వాటిని జిల్లావైద్యాధికారి ఎస్వీ కృష్ణారెడ్డి స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కనగానిపల్లికి చెందిన స్టాఫ్‌నర్సు, జిల్లా ఆస్పత్రిలో పనిచేస్తున్న స్టాఫ్ నర్సులకు జీతాలకు సంబంధించిన పిర్యాదులు అందాయని తెలిపారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సెల్వియా సాల్మన్ పాల్గొన్నారు.

పుట్టపర్తిలో కర్ణాటక వాసి మృతి



మృతుడు సురేష్ (ఫైల్)

పుట్టపర్తి రూరల్, ఫిబ్రవరి 27: జిల్లాకేంద్రంలోని ఆర్టీసీ బస్టాండులో మంగళవారం కర్ణాటక రాష్ట్రానికి చెందిన యువకుడు సురేష్ (33) మృతి సంఘటన చోటు చేసుకుంది. అర్బన్ పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రం యాదగిరికి చెందిన యువకుడు బస్టాండ్‌లో మృతి చెందాడు. దీనిపై డిపోమేనేజర్ అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు మేరకు పోలీసులు వచ్చి మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వద్ద గల సెల్‌ఫోన్, ఆధార్, పాన్‌కార్డు, ఓటర్‌కార్డుల ఆధారంగా కర్ణాటక వాసిగా గుర్తించి బంధువులకు సమాచారం అందజేశారు. యువకుడు రెండురోజుల క్రితం పుట్టపర్తికి వచ్చాడని, మృతదేహాన్ని తమ స్వగ్రామానికి తీసుకెళతామని బంధువులు తెలియచేసినట్లు పోలీసులు తెలిపారు. అతడు అనారోగ్యంతో మరణించినట్లు సమాచారం.

సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం



ఇంటింటా ప్రచారం చేస్తున్న కందికుంట యశోదమ్మ

కదిరి, ఫిబ్రవరి 27: చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతో మహిళలకు ఎంతో లబ్ధి చేకూరుతుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్ సతీమణి కందికుంట యశోదమ్మ పేర్కొన్నారు. పట్టణంలోని 18వ వార్డులో మంగళవారం ఆమె ఇంటింటి ప్రచారం చేశారు. వార్డు ప్రజలు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చంద్రబాబు అధికారంలోకి వస్తే.. 18ఏళ్లు దాటిన ప్రతి మహిళకు ప్రతినెలా రూ.15వందలు ఖాతాలో జమ చేస్తారన్నారు. అలాగే ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్‌సిలిండర్లు అందించనున్నట్లు పేర్కొన్నారు. మహిళలకు ఆర్టీసీ బస్సులోఉచిత ప్రయాణం కల్పిస్తారన్నారు. అమ్మకు వందనం పథకం ద్వారా ఇంట్లో చదివే పిల్లలందరికీ ఒక్కొక్కరికి రూ.15వేలు లబ్ధి చేకూరుస్తారని తెలిపారు. ఇక రైతులకు పెట్టుబడి సాయం కింద యేడాదికి రూ.20వేలు అందిస్తారని వివరించారు. కనుక వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పర్వీన్‌బాను, డైమండ్ ఇర్షాన్, ఫారూక్, ఇస్మాయిల్, తజ్మూల్, కౌన్సిలర్ సావిత్రమ్మ, పీట్ల రమణమ్మ, గంగరత్నమ్మ, ఉమాదేవి, ప్రమీలమ్మ, వై. రమణమ్మ, ఐటీడీపీ మన్సూర్, జునైద్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే ముస్లింలకు న్యాయం



యాసిన్ సూర ఫొటోను అందజేస్తున్న టీడీపీ మైనార్టీ నాయకులు

ధర్మవరం, ఫిబ్రవరి 27: ముస్లింలకు టీడీపీ హయాంలోనే న్యాయం జరుగుతుందని ఆ పార్టీ హిందూపురం పార్లమెంట్ మైనార్టీ ప్రధాన కార్యదర్శి నాగూర్‌హుస్సేన్ పేర్కొన్నారు. పట్టణంలోని 14 వార్డులో గల ముస్లిం కుటుంబాలకు మంగళవారం ఆయన స్థానిక మైనార్టీ నాయకులతో కలిసి యాసిన్‌సూర ఫొటోలను ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ సూచనల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ముస్లిం మైనార్టీలకు అనేక సంక్షేమ పథకాలు అందేవన్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఆ పథకాలన్నీ రద్దయ్యాయన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వస్తే ఆ పథకాలన్నీ మళ్లీ అమలవుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో మైనార్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు అత్తార్‌రహీంబాషా, నాయకులు రాళ్లపల్లిషరీఫ్, సలీంబాషా, ఉస్మాన్, టీడీపీ నాయకుడు చింతపులుసు పెద్దన్న పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్టు

- ఐదు బైక్‌ల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బైక్‌లను చూపుతున్న పోలీసులు

బత్తలపల్లి, ఫిబ్రవరి 27: ద్విచక్రవాహనాల దొంగను అరెస్టు చేసి రిమాండుకు పంపినట్లు సీఐ ఆరోహణరావు, ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. స్థానిక ఆర్డీటీ ఆస్పత్రి వద్ద కొద్దిరోజుల క్రితం ఓ గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్ర వాహనాన్ని దొంగలించేందుకు ప్రయత్నించాడని, వాహన యజమాని చూసి కేకలు వేయడంతో అతను పరుగు తీశాడని తెలిపారు. ఈ విషయం తమకు తెలియడంతో ద్విచక్ర వాహన దొంగను పట్టుకోవడంపై దృష్టి పెట్టామన్నారు. మంగళవారం గంటాపురం క్రాస్ సమీపంలో పోలీసు సిబ్బంది వాహనాల తనిఖీ చేస్తుండగా.. ఓ ద్విచక్ర వాహన దారుడు పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించాడన్నారు. పోలీసులు వెంటబడి అతడిని పట్టుకుని విచారించగా ద్విచక్ర వాహనాల దొంగగా తేలిందన్నారు. అతడిని నల్లమాడ మండలం సానేవారిపల్లికి చెందిన చియ్యోటి కూమార్‌గా గుర్తించారన్నారు. వెంటనే అరెస్టు చేసి 5ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అనంతరం అతడిని కోర్టుకు హాజరుపరిచామని పోలీసులు తెలిపారు.

క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించాలి




జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు

ధర్మవరం, ఫిబ్రవరి 27: ప్రతివిద్యార్థి క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని పట్టణంలోని వాసవీ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఈశ్వరయ్య సూచించారు. స్థానిక దేవాంగ కల్యాణ మండపంలో కళాశాల ఫేర్‌వెల్ డేను మంగళవారం ఘనంగా నిర్వహించారు ప్రిన్సిపాల్‌తో పా టు డైరెక్టర్ భాస్కర్‌రెడ్డి, అధ్యాపకులు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ప్రిన్సి పాల్ మాట్లాడుతూ.. విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకుని ముందుకు సాగాలన్నారు. క్రమశిక్షణ, పట్టుదలతో చదివి భవిష్యత్తులో ఉన్నతశిఖరాలను అధిరోహించాలన్నారు. తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ము చేయకూడదన్నారు. తర్వాత పలువురు విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. చివరలో గతేడాది ఇంటర్ ఫస్ట్ ఇయర్ పరీక్షలలో ప్రతిభ కనబరచిన 26 మంది విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని వినతి

పుట్టపర్తి, ఫిబ్రవరి 27: రానున్న సాధారణ ఎన్నికల విధుల నుంచి వివిధ సమస్యలు ఉన్న ఉపాధ్యాయులను మినహాయించాలంటూ ఎస్టీ యూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి, కార్యదర్శి చంద్రశేఖర్, నాయకులు సంపత్‌కుమార్, వెంగమనాయుడు ప్ర భుత్వాన్ని కోరారు. ఈ మేరకు పట్టణంలో మంగళవారం వారు డీఆర్వో కొండయ్యను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికల్లో దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులకు, ప్రమాదాలకు గురై మెడికల్ లీవ్‌లో ఉన్న వారికి, మెటర్నటీలీవ్‌లో ఉన్నవారికి, ఒంటరి మహిళలకు, చంటి పిల్లల తల్లులకు, రిటైర్మెంట్ దగ్గరలో ఉన్న వారికి, బదిర, అంగవైకల్యం గల ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని కోరారు.

చంద్రబాబును కలిసిన సామకోటి



చంద్రబాబుతో సామకోటి ఆదినారాయణ

పుట్టపర్తిరూరల్, ఫిబ్రవరి 27: తెలుగుదేశంపార్టీ అధినేత చంద్రబాబును ఆ పార్టీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ మంగళవారం అమరావతిలో కలిశారు. తాను చేస్తున్న సేవాకార్యక్రమాలతో పాటు, పార్టీ కోసం చేస్తున్న ప్రచార కార్యక్రమాలను వివరించారు. అనంతరం సత్యసాయి బాబా ఫొటోను చంద్రబాబుకు అందజేశారు. పార్టీలో కష్టపడి పని చేసేవారికి తగిన గుర్తింపు ఉంటుందని చంద్రబాబు తెలిపినట్లు సామకోటి పేర్కొన్నారు.

అభివృద్ధిని పట్టించుకోని సీఎం : సీపీఐ

ముదిగుబ్బ, ఫిబ్రవరి27: ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి గురించి ఏ మాత్రం పట్టించుకోలేదని సీపీఐ నాయకులు విమర్శించారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శి వేమయ్యయాదవ్ మాట్లాడారు. సీఎం చెప్పిన హామీలు ఇంతవరకు అమలు కాలేదన్నారు. తప్పులను ప్రశ్నిస్తున్న పత్రికా విలేకరులపై, ఫొటోగ్రాఫర్లపై , పత్రికా కార్యాలయాలపై దాడులు చేయడం దారుణమన్నారు. సొంత జిల్లా కడపకు సైతం జగన్ చేసిన అభివృద్ధి ఏంటో ప్రజలకు చెప్పాలన్నారు. జగన్ అధికారంలోకి వచ్చాక ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేదన్నారు ముదిగుబ్బ మండల కేంద్రంలో అధికారులు ప్రభుత్వ భూములను అధికార పార్టీ నాయకులకు కట్టబెడుతున్నారని, వాటిపై చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ నాయకులు సంతోష్, లెనిన్‌బాబు, బిల్లుకుళ్ళాయప్ప, సీపీఐ నాయకులు రమణ, చల్లాశ్రీనివాసులు, కిష్టయ్య పాల్గొన్నారు.

కాళికాంబ కమటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో కాళికాంబ కమటేశ్వరస్వామి

రొళ్ల, ఫిబ్రవరి 27: మండలంలోని రత్నగిరిలో వెలసిన కాళికాంబ కమటేశ్వర స్వామికి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ప్రత్యేక అలంకరణ చేశారు. వందల మంది భక్తులు తరలివచ్చి స్వామివారికి పూజలు చేయించారు. సమీప కర్ణాటక నుంచి కూడా భక్తులు తరలివచ్చారు. ఆలయకమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ప్రధాన అర్చకులు ఆర్వీ ప్రకాషాచార్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి.

మడకశిర సీఐ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న సీఐ రాజకుమార్

మడకశిరటౌన్, ఫిబ్రవరి 27: మడకశిర రూరల్ సీఐగా రాజకుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా ఆయనను మడకశిర రూరల్ సీఐగా అధికారులు నియమించడంతో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న సీఐ సురేష్‌బాబు క్రైంబ్రాంచ్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా సీఐ రాజ్‌కుమార్ మాట్లాడుతూ... శాంతి భద్రతల విషయంలో రాజీలేకుండా విధులు నిర్వహిస్తానని అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని పేర్కొన్నారు.

యువకుడి ఆత్మహత్య



ప్రసాద్ (ఫైల్)

చిలమత్తూరు, ఫిబ్రవరి 27: కొంత కాలంలగా అనారోగ్యంతో బాధపడుతూ మద్యానికి బానిసైన ఒక యువకుడు చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ గంగాధర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చిలమత్తూరు మండలం కోడూరుకు చెందిన తలారి చంద్ర కుమారుడు ప్రసాద్ (27) మంగళవారం మదురే పల్లి- కందూరుపర్తి రోడ్డులో ఒక చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి మూడు నెలల కిందటే వివాహమైంది. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో మద్యం తాగడం అలవాటు చేసు కున్నాడు. అయినా తన ఆరోగ్యం గురించి చింతిస్తూ మనోవేదనకు గురైన అతడు మద్యం తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు అందించిన సమాచారంతో సిబ్బందితో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించినట్లు ఎస్ఐ తెలిపారు. అనంతరం కుటుంబ సభ్యులతో విచారణ చేపట్టామన్నారు. మృతుడి భార్య నందిని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

ముగ్గురికి గాయాలు

చిలమత్తూరు, ఫిబ్రవరి 27: రెండు నిమిషాల్లో పెళ్లి మండపంలోకి అడుగుపెట్టి పెళ్లివారితో సంతోషంగా గడపాల్సిన వారిని విధి బలితీసుకుంది. ఒకరు మృత్యువాత పడగా, మరో ముగ్గురు తీవ్ర గాయాలపాలయ్యారు చిలమత్తూరు మండలం 544-ఈ జాతీయ రహదారిపై విరాట్ ప్యాలెస్ పెళ్లి మండపం ఎదుట మంగళవారం రాత్రి ఈ ఘోర దుర్ఘటన చోటుచేసుకుంది. చిలమత్తూరుకు చెందిన ఆదినారాయణప్ప (60) తన భార్య చెన్నమ్మ, చిన్నారి జగదీష్‌తో కలిసి ద్విచక్రవాహనంలో ఇంటి నుంచి విరాట్ ప్యాలెస్‌లో జరుగుతున్న వారి బంధువుల పెళ్లికి వెళ్లారు. అయితే పెళ్లి మండపం లోపలికి వెళ్లే సమయంలో గేటు వద్ద మలుపుతిరుగుతుండగా కొడికొండ చెక్‌పోస్టు వైపు నుంచి వచ్చిన ద్విచక్రవాహన దారుడు బాబజాన్ ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో రెండు ద్విచక్రవాహనాలు ఎదురుదురుగా బలంగా ఢీకొనడంతో నలుగురు తీవ్ర గాయాలపాలయ్యారు. వెంటనే స్థానికులు వారిని మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తరలించారు. వారిలో ఆదినారాయణప్ప తీవ్ర రక్తస్రావం జరిగి మార్గమధ్యలోనే ప్రాణాలు కోల్పోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. తీవ్రంగా గాయపడిన ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండటంతో వారిని హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పెళ్లికి వస్తూ ఇలా ప్రాణాలు కోల్పోవడంతో పెళ్లి మండపంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

గుమ్మయ్యగారి పల్లి సమీపంలో...

గోరంట్ల, ఫిబ్రవరి 27: మండలంలోని పుట్టపర్తి రహదారిలో గుమ్మయ్యగారిపల్లి సమీపంలో మంగళవారం ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొనడంతో ముగ్గురు గాయపడ్డారు. ధర్మవరం పట్టణానికి చెందిన శ్రీనివాసులు కుమారుడు గోవర్ధన్ తన చెల్లెలు మహేశ్వరి, బంధువు ప్రసన్నతో కలిసి ద్విచక్రవాహనంలో గోరంట్లకు వెళ్తున్నాడు. గుంతపల్లి సమీపంలోని నిషాడిజైన్సు గ్యార్మెంట్స్ ఫ్యాక్టరీలో ఉద్యోగం గురించి మాట్లాడడానికి వారు ముగ్గురు వెళ్తున్నట్లు తెలిసింది. వెనుక వస్తున్న కారు ఆ ఓవర్‌టేక్ చేసే సమయంలో ఆ ద్విచక్రవాహనాన్ని తగలడంతో ప్రమాదం జరిగింది. ఈప్రమాదంలో గోవర్ధన్ తలకు, శరీరానికి బలమైన గాయాలైకాగా, మిగిలిన ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. గోవర్ధన్‌కు ప్రమాదం జరిగిన వెంటనే ఫిట్స్ రావడంతో పాటు, విచిత్రంగా ప్రవర్తించాడు. చికిత్సకు సహకరించకుండా తీవ్రంగా ప్రతిఘటించినట్లు తెలిసింది. ప్రమాదం జరిగిన వెంటనే వారిని ఆటోలో గోరంట్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. డాక్టర్ వినోద్‌కుమార్ చికిత్సలు నిర్వహించారు. తలకు బలమైన గాయం కావడంతో అలా ప్రవర్తిస్తున్నాడని గోవర్ధన్‌ను మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో హిందూపురం తరలించారు.

కొబ్బరి చెట్టుపై నుంచి పడి మరొకరికి...

గోరంట్ల, ఫిబ్రవరి 27: మండలంలోని బాచెన్నపల్లికి చెందిన ఆదినారాయణ కొబ్బరిచెట్టుపై నుంచి కింద పడి మంగళవారం తీవ్రంగా గాయపడ్డాడు. గ్రామానికి చెందిన చలపతి కుమారుడైన ఆదినారాయణ టెంకాలు కోయడానికి మంగళవారం మధ్యాహ్నం కొబ్బరి చెట్టు ఎక్కినట్లు గ్రామస్థులు తెలిపారు. మధ్యాహ్నం ఎండ తీవ్రంగా ఉండడంతో కళ్లుతిరిగి చెట్టుపై నుంచి కింద పడినట్లు చెప్పారు. తలకు, నడుముకు గాయాలుకాగా, గోరంట్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. డాక్టర్ హరీష్ చికిత్సలు చేసి, మెరుగైన వైద్యంకోసం 108 వాహనంలో హిందూపురం తరలించారు.

గీత కార్మికుల కడుపుకొడుతున్న వైసీపీ

- మంత్రి ఉష అండతో రెచ్చిపోతున్న స్థానిక నాయకులు
- టీడీపీ పెనుకొండ నియోజకవర్గ అభ్యర్థి సవిత



డీఎస్పీ బాజీజాన్‌సైదాతో మాట్లాడుతున్న సవిత

పెనుకొండ టౌన్, ఫిబ్రవరి 27 : కులవృత్తితో జీవనం సాగిస్తున్న గీత కార్మికులను సైతం అధికార పార్టీ వైసీపీ వదలడంలేదని, వారికి కేటాయించిన భూములను సైతం కబ్జా చేసేందుకు పూనుకున్నారని టీడీపీ పెనుకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత మండిపడ్డారు. ఆమె మంగళవారం టీడీపీ స్థానిక కార్యాలయంలో పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సవిత మాట్లాడుతూ... గీత కార్మికులకు తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉంటుందని, చంద్రబాబు పాలనలో సముచిత స్థానం కల్పించామన్నారు. అంతేగాకుండా ఈత వనాలను పెంచి వారికి భూములు కేటాయించామన్నారు. ఈ క్రమంలోనే పెనుకొండకు నూతనంగా వచ్చిన వలసపక్షి మంత్రి ఉషశ్రీచరణ్ అండతో వైసీపీ స్థానిక నాయకులు భూకబ్జాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. రొద్దం మండలం ఆర్ కంచిసముద్రం గ్రామంలో దాదాపు 200ఎకరాల్లో వందల్లో ఈత చెట్లు ఉన్నాయన్నారు. వాటిలో దాదాపు 500 చెట్లను ఎక్స్‌కవేటర్ సాయంతో ధ్వంసం చేయడమేకాకుండా కాల్చివేశారన్నారు. గీత కార్మికుల జీవనోపాధి దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈత చెట్లు ధ్వంసం చేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. అంతేకాకుండా 500ఈత చెట్లు ధ్వంసం చేస్తే అధికారులు నామమాత్రంగా రూ.500పెనాల్టీ వేశారని గీత కార్మికులు తమతో చెప్పారన్నారు. ఇప్పటికైనా ఇలాంటి భూకబ్జాదారులను కట్టడి చేయాలని అన్నారు. లేనిపక్షంలో తామే గీతకార్మికులకు అండగా ఉండి పోరాడుతామని సవిత భరోసా ఇచ్చారు.

కార్యకర్తలకు నిత్యం అండగా ఉంటా

పెనుకొండ రూరల్ : కార్యకర్తలకు ఏ కష్టమొచ్చినా తాను అండగా ఉంటానని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత పేర్కొన్నారు. ఆమె మంగళవారం డీఎస్పీ బాజీజాన్‌సైదాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెనుకొండ ప్రజలు కక్షలు, కార్పణ్యాలకు దూరమని, తమ టీడీపీ నాయకులు సమన్వయంతో ఉండే వ్యక్తులన్నారు. రానున్న ఎన్నికలకు సహకరిస్తామని డీఎస్పీతో ఆమె పేర్కొన్నారు. ఏదైనా సమస్యాత్మకం ఉంటే తమతో సంప్రదించాలని డీఎస్పీని కోరారు. ఆమె వెంట మాజీ ఎంపీటీసీ రమణమ్మ, సర్పంచులు శ్రీనివాసులు, నరసింహులు, మాజీ మండల కన్వీనర్ శ్రీరాములు, త్రివేంద్ర, బాబుల్‌రెడ్డి, తదితర నాయకులు పాల్గొన్నారు.

ఈతవనాన్ని పరిశీలించిన గీతకార్మిక నాయకులు



ఈతచెట్లను కాల్చేసిన దృశ్యాన్ని పరిశీలిస్తున్న నాయకులు

రొద్దం, ఫిబ్రవరి 27 : మండలంలోని కంచిసముద్రం గ్రామ సమీపంలో ఉన్న చెరువులోని వందల ఈతచెట్లను కొందరు అక్రమార్కులు ఎక్స్‌కవేటర్ సాయంతో పెకలించి, దాదాపు నాలుగు ఎకరాల భూమిని ఆక్రమించుకున్నట్లు సోమవారం కల్లుగీత కార్మికులు స్పందనలో కలెక్టర్ అరుణ్‌బాబుకు ఫిర్యాదు చేసిన విషయం విదితమే. ఆక్రమణకు గురైన స్థలాన్ని మంగళవారం కల్లుగీత కార్మిక సంఘం నాయకులు ఆకుల రమణ, చిన్నప్పయ్య, సీపీఎం నాయకులు నారాయణ తదితరులు పరిశీలించారు. గీత కార్మికుల పొట్ట కొట్టేందుకు భూస్వాములు భూకబ్జాలు చేస్తున్నారని వారు మండిపడ్డారు. దీనిపై ప్రభుత్వం, అధికారులు చట్టపరమైన చర్య లు తీసుకోకపోతే కల్లుగీత కార్మికులంతా కలిసి నిరసన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించా రు. ఎన్నోమార్లు రెవెన్యూ, ఎక్సైజ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు పట్టించుకోకపోవడంతో కబ్జాదారులు చెట్లన్నింటినీ తొలగించి కాల్చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు పెద్దన్న, పక్రుద్దీన్, కల్లుగీత కార్మికులు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గం ఎంపిక



ఎన్నికైన జిల్లా కార్యవర్గం సభ్యులు

హిందూపురం, ఫిబ్రవరి 27 : కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మెడికల్ అసోసియేషన్ సభ్యులు హిందూపురంలో సోమవారం రాత్రి సమావేశమయ్యారు. సీమాంధ్ర డ్రగ్ డీలర్స్ అసోసియేషన్ కార్యదర్శి కరుణకుమార్ గుప్త పర్యవేక్షణలో జరిగిన సమావేశంలో జిల్లా అసోసియేషన్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా శివ కుమార్, కార్యదర్శిగా నాగరాజు, కోశాధికారిగా అనీల్ ఎంపికైనట్లు వారు తెలిపారు. ఈ సమావేశంలో హిందూపురం, కదిరి, ధర్మవరం, పెనుకొండ, మడకశిర, పుట్టపర్తి, నియోజకవర్గాల నుంచి మెడికల్ షాపుల యజమానులు హాజరయ్యారు. ఎన్నికల పరిశీలకులుగా శ్రీకాకుళం డ్రగ్స్ ట్రేడ్ అసోసియేషన్ కార్యదర్శి మణిరాజు, చిత్తూరు జిల్లా అధ్యక్షుడు నరేష్‌బాబు , మురళీక్రిష్ణ తదితరులు హాజరయ్యారు.

బస్సు ఢీ కొని వ్యక్తి దుర్మరణం

మడకశిర రూరల్, ఫిబ్రవరి 27 : మండలంలోని ఉక్కడం రంగాపురం గ్రామం వద్ద మంగళవారం రాత్రి 9.50 గంటలకు కేఎస్ఆర్టీసీ బస్సు ఢీ కొని రామాంజనప్ప (45) అనే వ్యక్తి అక్కడి అక్కడే దుర్మరణం చెందాడు. స్థానికులు అందించిన వివరాల ప్రకారం... మడకశిర పట్టణానికి చెందిన రామాంజప్ప పని నిమిత్తం ఉక్కడం రంగాపురం వెళ్లాడు. అక్కడ పని ముగించుకుని రాత్రి 9.50 గంట సమయంలో కాలినడకన రోడ్డు మార్గం గుండా తిరిగి మడకశిరకు వస్తున్నాడు. అయితే బెంగళూరు నుంచి పావగడకు వెళ్తున్న కేఎస్ఆర్టీసీ బస్సు రోడ్డు పక్కన వెళ్తున్న రామాంజనప్పను ఢీ కొట్టింది. దీంతో అతడు అక్కడికి అక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు.

క్రీడా స్ఫూర్తిని దెబ్బతీస్తున్న వైసీపీ : సవిత

పెనుకొండ టౌన్, ఫిబ్రవరి 27 : అధికార పార్టీ వైసీపీ నేతలు అహంకారంతో క్రీడాకారుల స్ఫూర్తిని దెబ్బతీస్తున్నారని టీడీపీ పెనుకొండ నియోజకవర్గ అభ్యర్థి సవిత అన్నారు. ఆమె మంగళవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో మాట్లాడుతూ హనుమ విహారికి, ఆంధ్రప్రజలకు ఈ సైకో ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే వైసీపీ నేతల ఒత్తిళ్లతో తెలుగు తేజాలు ఎన్నో పక్క రాష్ట్రాలకు వెళ్లి వారి అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారని అన్నారు. ప్రత్యర్థులకు చుక్కలు చూపే క్రికెటర్ హనుమ విహారి వైసీపీ నేతల ఒత్తిళ్లకు బలికావాల్సి వచ్చిందన్నారు. వైసీపీ నేత కుమారుడిని మందలించిన పాపానికి విహారిని ఆంధ్ర రంజి క్యాప్టెన్ బాధ్యతల నుంచి తొలగించేలా చేశారన్నారు. విహారి తప్పేంలేదని టీం సభ్యులు ఓ వైపు చెప్పినా నేతల ఒత్తిళ్లు ఆగలేదన్నారు. విహారిని క్యాప్టన్‌గా కొనసాగించాలని, జట్టులోని అశ్విన్‌తో సహా అనేక మంది మద్దతు తెలిపారన్నారు. క్రీడల్లోనూ రాజారెడ్డి రాజ్యాంగం అమలు చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన అధికారులు



మద్దనకుంటలో పరిశీలిస్తున్న ఎన్నికల ఆర్ఓ గౌరీశంకర్‌రావు

గుడిబండ, ఫిబ్రవరి 27 : మండలంలోని మద్దనకుంట, కేకేపాళ్యం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను మడకశిర ఎన్నికల రిటర్నింగ్ అధికారి గౌరీశంకర్ రావు మంగళవారం పరిశీలించారు. మండలంలోని మద్దనకుంటప్ప గ్రామంలో 683మంది ఓటర్లు ఉన్నారని తమ గ్రామంలోనే పోలింగ్ బూత్‌ను ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరారు. కేకే పాళ్యం గ్రామంలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయడంవల్ల 3కి.మీ. వెళ్లి ఓటు వేయాల్సి ఉందని దీంతో ఓటర్లు తీవ్ర ఇబ్బందులు పడి వెళ్తున్నట్లు ఓటర్లు వాపోయారు. సుదూర ప్రాంతానికి వెళ్లలేక ఎంతోమంది తమ ఓటు హక్కును వినియోగించుకోలేక పోతున్నారని వాపోయారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేసి సమస్యను పరిష్కరించేందుకు కృషిచేస్తానని రిటర్నింగ్ అధికారి అన్నారు. అనంతరం పాఠశాల భవనాలను పరిశీలించారు. ఆయనవెంట తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి, ఆర్ఐ మహ్మద్ బిలాల్, వీఆర్ఓ త్యాగరాజు, ఎన్నికల జూనియర్ అసిస్టెంట్ రామలింగప్ప, తదితరులు పాల్గొన్నారు.

అగళి: మండలంలోని రామనపల్లి, ముక్కడంపల్లి, దాసేగౌడనపల్లి, కోడిపల్లి, ఆర్‌జీపల్లి, అగళి గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను మంగళవారం తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, ఎంఈఓ చంద్రశేఖర్ నాయుడు, ఆర్ఐ గుర్రన్న పరిశీలించారు. త్వరలో జరుగనున్న ఎన్నికల నేపథ్యంలో మండల వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించనున్నట్లు వారు తెలిపారు. వారి వెంట ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు ఉన్నారు.

గుడ్ టచ్- బ్యాడ్ టచ్‌పై అవగాహన


చిలమత్తూరు, ఫిబ్రవరి 27: బాలికలు గుడ్ టచ్- బ్యాడ్ టచ్‌లపై క్షుణ్ణంగా అవగాహన కలిగి ఉండాలని హిందూపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ రెడ్డి మరణమ్మ పేర్కొన్నారు. ఆమె మంగళవారం మండలంలోని దేమకేతేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాలికలకు గుడ్ టచ్- బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించారు. స్పర్శలో తేడాలను కనిపెట్టలేని చిన్నారులు కామాంధుల దుర్మార్గాలకు బలైపోతున్నారన్నారు. వారిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌లపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఆమె విద్యార్థులను కోరారు.


అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు : ఎస్ఐ

అగళి, ఫిబ్రవరి 27 : అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని అగళి ఎస్ఐ వీరేష్ పేర్కొన్నారు. ఆయన మంగళవారం పీ బ్యాడిగెర చెక్‌పోస్ట్ వద్ద వాహనాలను తనిఖీ చేశారు. అగళి మండలం కర్ణాటక సరిహద్దులో ఉన్నందున త్వరలో జరుగనున్న ఎన్నికల నేపథ్యంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇద్దరు డాక్టర్లు, హెడ్‌నర్సుపై సస్పెన్షన్ వేటు

- తుమకూరు డీహెచ్ఓ మంజునాథ్ ఆదేశాలు
- పావగడ ఆసుపత్రిలో ముగ్గురు మహిళల మృతికి వారే కారకులని ఆరోపణలు





మృతిచెందిన అనిత, అంజలి, నరసమ్మ(ఫైల్)

పావగడ, ఫిబ్రవరి 27: పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో ఈనెల 22న ఏడుగురు మహిళలకు శస్త్ర చికిత్స చేయగా మూడు రోజుల వ్యవధిలో ముగ్గురు మహిళల మృతికి కారణమనే ఆరోపణలపై డాక్టర్ పూజా, డాక్టర్ కిరణ్, హెడ్‌నర్సు పద్మావతిని సస్పెండ్ చేసినట్లు తుమకూరు డీహెచ్ఓ మంజునాథ్ ఆదేశాలు వెల్లడించారు. వీరంతా ఎన్‌హెచ్ఎం కాంట్రాక్టు కింద విధులు నిర్వహిస్తున్నారు. కుటుంబ నియంత్రణ ఆపరేషన్ కోసం వచ్చిన రాజ వంతి గ్రామానికి చెందిన అనిత(28)కు, రెండో కాన్పు కోసం వచ్చిన వీర్లగొంది గ్రామానికి చెందిన అంజలి(24)కి సిజేరియన్, గర్భకోశ ఆపరేషన్ కోసం వచ్చిన బ్యాడనూరు గ్రామానికి చెందిన నరసమ్మ(40)తోపాటు మరో నలుగురికి డాక్టర్ పూజా, హెడ్‌నర్సు పద్మావతి శస్త్రచికిత్సలు చేశారు. అయితే పైన తెలిపిన ముగ్గురూ ఒకరి తరువాత ఒకరు మృతి చెందడంతో మృతుల బంధువులు సోమవారం ధర్నా చేపట్టిన విషయం తెలిసిందే. అలాగే మంగళవారం జయ కర్ణాటక, కర్ణాటక రక్షణ వేదికతో పాటు పలు స్వచ్ఛంద సేవా సంస్థల నాయకులు పావగడ ప్రభుత్వాస్పత్రి ఎదుట పెద్దఎత్తున ధర్నా చేపట్టారు. దీంతో ఆస్పత్రి వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసులు రంగప్రవేశం చేసి పరిస్థితిని అదుపుచేశారు. ముగ్గురు మహిళల మృతికి కారకులైన డాక్టర్ పూజా, డాక్టర్ కిరణ్, హెడ్‌నర్సు పద్మావతిని సస్పెండ్ చేసినట్లు టీహెచ్ఓ తిరుపతయ్య తెలపడంతో పరిస్థితి సర్దుమణిగింది.

శస్త్ర చికిత్స చేసింది సీనియర్ నర్సులే..!

పావగడ ప్రభుత్వాస్పత్రిలో ఏడుగురు మహిళలకు శస్త్ర చికిత్స చేసేందుకు స్త్రీరోగ నిపుణులు డాక్టర్ పూజా ఈనెల 22వ తేదీన బాధ్యతలు తీసుకొన్నారు. వారిలో నలుగురు మహిళలకు డాక్టర్ పూజా చికిత్స చేశారు. చనిపోయిన ముగ్గురు మహిళలకు హెడ్‌నర్సు పద్మావతి, మరికొందరు అనుభవం లేని నర్సులు శస్త్రచికిత్సలు చేసినట్లు బంధువులు, తదితరులు ఆరోపిస్తున్నారు. శస్త్ర చికిత్స సమయంలో బీపీ, శ్వాసకోశ పరిస్థితిని చూసుకొని చేయాల్సి ఉండేదంటున్నారు. అయితే వారికి అనుభవం లేకపోవడం, డాక్టర్ నిర్లక్ష్యం వల్ల శస్త్రచికిత్స జరిగిన మూడు రోజుల వ్యవధిలోనే ముగ్గురు మహిళలు మృతిచెందారని అంటున్నారు. పావగడ ప్రభుత్వాసుపత్రి ఒకరు, బెంగళూరులోని వాణివిలాస్ ఆస్పత్రిలో ఇద్దరు మృతి చెందారు. ఈ సంఘటన కర్ణాటక రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించడంతో ఎన్‌హెచ్ఎం కింద డబ్బులు తీసుకొని పనిచేయిస్తున్న డాక్టర్ కిరణ్‌ను వైద్య వృత్తి నుంచి డిస్మిస్ చేయాలని పలు స్వచ్ఛంద సేవా సంస్థల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.



ఆస్పత్రి వద్ద జయ కర్ణాటక, కర్ణాటక రక్షణ వేదిక నాయకుల ఆందోళన

టీడీపీ విజయానికి సమష్టిగా పనిచేద్దాం

టీడీపీ మడకశిర నియోజకవర్గ అభ్యర్థి సునీల్ కుమార్



ఉప్పార్లపల్లి నాయకులతో చర్చిస్తున్న సునీల్ కుమార్

మడకశిర రూరల్, ఫిబ్రవరి 27 : తెలుగుదేశం పార్టీ విజయానికి నాయకులు, కార్యకర్తలు అందరూ కలిసికట్టుగా శ్రమించి విజయం సాధిద్దామని టీడీపీ నియోజకవర్గ అభ్యర్థి సునీల్ కుమార్ పేర్కొన్నారు. మండలంలోని హరేసముద్రం, క్యాంపురం, ఉప్పార్లపల్లి గ్రామాల్లో ఆయన మంగళవారం పర్యటించారు. మొదట ఉప్పార్లపల్లిలో మారెమ్మదేవత విగ్రహప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయా గ్రామాల్లో పర్యటించి స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలసి చర్చించారు. అందరూ సమన్వయంతో పనిచేసి పార్టీ యజయానికి కృషిచేయాలని కోరారు. సునీల్ కుమార్ వెంట మాజీ ఎంపీపీ అశ్వత్థామప్ప, మండల మాజీ కన్వీనర్ రామాంజనేయులు, రాజగోపాల్, కిష్టప్ప, ఈశ్వర్, హనుమంతేగౌడ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజకీయ కక్షతోనే హనుమవిహారిని తప్పించారు

మడకశిరటౌన్: క్రీడా స్ఫూర్తిని దెబ్బతీసేలా వైసీపీ ప్రభుత్వం వ్యవహరిస్తోందని, రాజకీయ కక్షతోనే క్యాప్టెన్సీ నుంచి హనుమవిహారిని తప్పించ డం హేయమైనచర్య అని టీడీపీ మడకశిర నియోజకవర్గ అభ్యర్థి సునీల్‌కుమార్ అన్నారు. ఆయన మంగళవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వైసీపీ నాయకుల అహం ఏపీలో క్రీడాకారుల క్రీడా స్ఫూర్తిని దెబ్బతీసేలా ఉందన్నారు. వైసీపీ నేతల ఒత్తిళ్లతోనే తెలుగుతేజం, క్రికెట్ క్రీడాకారుడు హనుమవిహారిని క్యాప్టెన్సీ నుంచి తప్పించారన్నారు. వైసీపీ నేత కుమారుడిని మందలించిన పాపానికి ఇలా చేయడం ఎంతవరకు న్యాయం అన్నారు. క్రీడా మంత్రి రోజా ఎందుకు స్పందించడం లేదని, ఆమె ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. వైసీపీ నేతలు రాజారెడ్డి రాజ్యాంగాన్ని క్రికెట్‌లో కూడా అమలు చేస్తున్నారని విమర్శించారు. ఒకవైపు ఆడుదాం ఆంధ్రాఅంటూ క్రీడలకు తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని అంటూనే మరోవైపు క్రీడాకారులను జగన్ ప్రభుత్వం అణగదొక్కుతోందన్నారు. భవిష్యత్తులో వైసీపీ ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు.

'స్వయంకృషితో ఎదిగి సమాజానికి తోడ్పడండి'

పెనుకొండ రూరల్, ఫిబ్రవరి 27 : ప్రతి విద్యార్థి తన జీవితంలో స్వయంకృషితో ఎదిగి సమాజానికి తగు సేవ అందించాలని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు, అధ్యాపకుడు జీఎల్ఎన్ ప్రసాద్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంగళవారం మండలంలోని రాంపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్-3 ప్రత్యేక శిబిరంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవితంలో తన సోమరితనమే తమ శత్రువుగా మారి పెను ప్రమాదంగా తయారవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళ్యాణదుర్గం ప్రిన్సిపాల్ జయరాంరెడ్డి, ఉపాధ్యాయులు యశోదరాణి, శ్రీదేవి, చెన్నారెడ్డి, ఎన్ఎస్ఎస్ పీఓ కాంతారావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల కళ్యాణదుర్గం ప్రిన్సిపాల్ జయరాంరెడ్డిని సన్మానించారు.

జల్‌జీవన్ ద్వారా ప్రతి ఇంటికీ నీరు: బీజేపీ

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 27: దేశ వ్యాప్తంగా ప్రతి ఇంటికి నీరు అందించాలనే ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం జల జీవన్ పథకాన్ని ప్రవేశపెట్టిందని బీజేపీ నాయకులు పేర్కొన్నా రు. ప్రజా పోరు యాత్రలో భాగంగా మంగళవారం మండల పరిధిలోని చలవెందల, బాలంపల్లి గ్రామాల్లో వారు పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం అందిస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు ప్రజలకు సక్రమంగా అందుతున్నాయా లేదా అని విచారించారు. ప్రతి ఇంటికి ఉచిత కొళాయి ఏర్పాటు చేసి నీరందించాలని గ్రామాల్లో పంచాయతీ అధికారులకు, మునిసిపాలిటీలో మునిసిపల్ అధికారులకు సూచిస్తున్నామని తెలిపారు. జలజీవన్ పథకానికి సంబంధించి బాలంపల్లి పంచాయతీకి రూ.7.5 లక్షలు కేంద్రం నుంచి అందాయన్నారు. తెల్ల కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ ఈ పథకానికి అర్హులన్నారు. కార్యక్రమంలో ప్రజాపోరు యాత్ర జిల్లా కో కన్వీనర్ చలపతి, బీజేపీ తిరుపతి ఇన్‌చార్జ్ పీడీ పార్థసారథి, అసెంబ్లీ కన్వీనర్ ఆదర్శ్‌కుమార్, ప్రజాపోరు యాత్ర హిందూపురం అసెంబ్లీ కో కన్వీనర్ తిరుమలేష్, నాయకులు హరీష్‌కుమార్, శివారెడ్డి, గోపీనాథ్, నవీన్ తదితరులు ఉన్నారు.

విద్యుత్ లోవోల్టేజీ సమస్య పరిష్కరించండి

విద్యుత్ శాఖ ఏడీకి విన్నవించిన బుళ్లసముద్రం రైతులు

మడకశిర రూరల్, ఫిబ్రవరి 27 : విద్యుత్ లోవోల్టేజీ సమస్య పరిష్కరించి రైతులను ఆదుకోవాలని బుళ్ళసముద్రం గ్రామానికి చెందిన రైతులు మాజీ ఎంపీటీసీ రామిరెడ్డి, తిప్పేనరసప్ప, సత్యనారాయణ, రంగస్వామి, గంగప్ప, సుధాకర్ పేర్కొన్నారు. వారు మంగళవారం విద్యుత్ ఏడీ ఎస్ ప్రసాద్ కలిశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ... బుళ్లసముద్రం పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో తీవ్ర లోవోల్టేజీ సమస్య ఉందని తెలిపారు. దీంతో వ్యవసాయ బోర్లలో మోటార్లు కాలిపోతున్నాట్లు ఏడీకి వివరించారు. విద్యుత్ కూడా నిరంతరంగా ఇవ్వకపోవడంతో అప్పులు చేసి సాగు చేసిన పంటలు ఎండముఖం పడుతున్నాయిని తెలిపారు. వెంటనే పంచాయతీ పరిధిలో విద్యుత్ లోవోల్టేజీ సమస్య పరిష్కరించాలని కోరారు. అనంతరం విద్యుత్ ఏడీ మాట్లాడుతూ.. వేసవిలో లోవోల్టేజీ సమస్యలు అధికంగా ఉన్నాయన్నారు. బుళ్లసముద్రం గ్రామం విద్యుత్ సబ్ స్టేషన్‌కు దూరంగా ఉండడంతో వేసవిలో సమస్య అధికంగా ఉంటుందన్నారు. గ్రామంలో స్థలం పరిశీలిస్తున్నామని, త్వరలో అక్కడ విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మించనున్నట్లు తెలిపారు. అంతవరకు లోవోల్టేజీ సమస్య రాకుండా చర్యలు చేపడుతామన్నారు.

అడవికి నిప్పు - పర్యావరణానికి ముప్పు

మడకశిరటౌన్, ఫిబ్రవరి 27: చెట్లు నరకడం, అటవీ ప్రాంతాలకు నిప్పు పెట్టడం పర్యావరణానికి ఎంతో ముప్పు అని గ్రీన్ భారత్ ఫౌండేషన్ అధ్యక్షుడు కోడిపల్లి కామరాజు అన్నారు. ఆయన మంగళవారం పట్టణంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. గ్రీన్‌భారత్ ఫౌండర్ డాక్టర్ శంకర్‌నారాయణ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ, పచ్చనిచెట్లను విచక్షణా రహితంగా నరకడం వంటి వాటిని ఆపేందుకు ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. మడకశిర కొండ ప్రాంతంలో చెట్లు, అటవీ ప్రాంత పరిరక్షణకు కృషి చేస్తామని తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ముదిగుబ్బ, ఫిబ్రవరి27: ఈనెల 25వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మండలంలోని నాగులగుబ్బలకు చెందిన నరసింహుడు (21) తన తండ్రితో కలిసి బైక్‌పై వెళుతుండగా.. మండల కేంద్రంలోని దొరిగల్లు రోడ్డు సమీపంలో లారీ ఢీకొట్టింది. ప్రమాదంలో తండ్రీకొడుకులు తీవ్రగాయాలై చికిత్స పొందుతున్నా. కాగా అనంతపురం ఆస్పత్రిలో కొడుకు నరసింహుడు(21) చికిత్స పొందుతూ మరణించాడని, కేసు నమోదు చేసుకున్నట్లు ముదిగుబ్బ పోలీసులు పేర్కొన్నారు.

మిస్టర్ ఆంధ్ర బాడీబిల్డింగ్ పోటీల్లో పురం యువకులు



సాధించిన పథకాలతో పురం బాడీబిల్డర్లు

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 27: మిస్టర్ ఆంధ్ర బాడీబిల్డింగ్ పోటీల్లో హిందూపురానికి చెందిన యువకులు ప్రతిభకనబరిచినట్లు జిల్లా బాడీ బిల్డర్ల అసోసియేషన్ అధ్యక్షుడు ఆరిఫ్ తెలిపారు. ఈ నెల 25న కడపలో జరిగిన మిస్టర్ ఆంధ్ర బాడీబిల్డింగ్ పోటీల్లో పురం యువకులకు ఎనిమిది మంది పాల్గొన్నారు. అందులో 65 కేజీల విభాగంలో నవీద్‌కు కాస్యం, 80 కేజీల విభాగంలో అకిబ్‌కు కాస్యం,55 కేజీల విభాగంలో తబ్రేజ్‌కు రజితం వచ్చిందన్నారు. అదే విధంగా దివ్యాంగ వర్గంలో సద్దాంకు రజత పతకం దక్కిందన్నారు. విజేతలను అసోసియేషన్ నాయకులు నగేష్, యూనస్ అభినందించారు.